


ప్రజాపోరు ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు

ట్రూ అప్ చార్జీల భారాన్ని
ప్రభుత్వమే భరించాలి

- వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

6



బాప్‌రే.. ఏం ధర!



● టన్ను జామాయిల్ రూ.8100

జిల్లా అటవీ శాఖకు జామాయిల్ తోటలు సిరులు కురిపిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టన్ను జామాయిల్ ధర రూ.8100 పలికింది. మొదటి విడతలో గత సంవత్సరం రూ.3,460 పలగ్గా ప్రస్తుతం ఆన్‌లైన్ టెండర్ల ద్వారా రూ.8100లకు కోడ్ చేశారు. జిల్లాలోని 3,500 హెక్టార్లలోని జామాయిల్‌కు అటవీ శాఖ టెండర్లు ఆహ్వానించింది. దాదాపు 1,02,000 మెట్రిక్ టన్నుల కర్ర రానున్నట్లు అంచానాలు వేశారు. సోమవారం జరిగిన ఆన్‌లైన్ టెండర్లలో 8 సంస్థలు పాల్గొనగా, నాలుగు సంస్థలు మాత్రమే అర్హత సాధించాయి. గ్లోబల్ టెండర్లలో పోటీపడ్డ నాలుగింటిలో నెల్లూరుకు చెందిన ప్రతిష్టా ట్రేడర్స్ రూ.8,100లకు టెండర్ దక్కించుకుంది. దీంతో అటవీ శాఖకు మొదటి విడత కంటే దాదాపు రెట్టింపు ఆదాయం రానున్నది. 1,02,000 టన్నులకు గాను రూ.82 కోట్ల మేర తమ శాఖకు రాబడి రానున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



నువ్వెంత.. ఆ నువ్వెంత!?

- నాలుగు రోజుల్లో నీ సంగతి తేలుస్తా!
- తలపడేంతస్థాయిలో ఇద్దరు అధికారుల ఘర్షణ
- రైతులు, ప్రజల ముందే వాగ్వాదం
- సిబ్బంది చొరవతో సద్దుమణిగిన వ్యవహారం
- వెంకటాచలంలో ఆలస్యంగా వెలుగులోకి..

- వివరాలు 6లో..

భజే పార్వతీ వల్లభం నీలకంఠం

కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉపవాస దీక్షలతో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద బారులుతీరి పాలభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లకు విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించడంతోపాటు కార్తీక దీపారాధనకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. రాత్రి ప్రాకారోత్సవాలు, పేట ఉత్సవాలు జరిగాయి.

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



23న జడ్పీ సమావేశం

నెల్లూరు జడ్పీ, ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్యం, నెడ్ క్యాప్, వ్యవసాయం, నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

పయ్యావుల.. కాసుల గలగల

రాష్ట్ర బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు

పెండింగ్ ప్రాజెక్టులకూ భారీ ఊరట ● తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.879.24 కోట్లు

యూజీడీ పూర్తికి రూ.126 కోట్లు ● రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు


కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో సింహపురికి సముచిత స్థానం దక్కింది. అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు సముచిత స్థానం లభించింది. పలు కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. ఐదేళ్ల క్రితమే ఆగిపోయిన నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పథకాలతోపాటు కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు. అలానే రాష్ట్ర యూనిట్‌గా ప్రధాన శాఖలకు నిధులు కేటాయించగా, వాటిలో జిల్లావాటాగా ఆ నిధులను ఆయా శాఖలు విభజించనున్నాయి.



● యూజీడీకి మోక్షం

నెల్లూరు నగరాభివృద్ధిలో భూగర్భ డ్రైనేజీ(యూజీడీ) పథకం, తాగునీటి పథకాలు కీలకమైనవి. 2014-19 మధ్యన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ రెండు ప్రాజెక్టులను సుమారు రూ.1100 కోట్లతో ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికే ఈ పథకాల పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కక్ష పూరితంగా వ్యవహరించింది. మరో రూ.100 కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవి. కానీ గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ యూజీడీ, తాగునీటి పథకాల పనులకు మోక్షం లభించింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో పనులను పరిశీలించిన నిపుణులు ఆ మేరకు నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ క్రమంలోనే యూజీడీ, తాగునీటి పథకాలను పూర్తి చేసేందుకు తాజా బడ్జెట్‌లో రూ.126.53 కోట్లు కేటాయించడం విశేషం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

● సోమశిలకు మహర్దశ



2021లో సంభవించిన వరదలకు జిల్లాజలప్రసాది సోమశిల జలాశయం అతలాకుతలైంది. పోటెత్తిన వరదకు డ్యాం ముందుభాగం దెబ్బతిన్నది. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.99.11 కోట్లు ఖర్చు అవుతుందని ఇంజనీర్లు ప్రతిపాదించగా, టెండర్లు ఆహ్వానించారు. ఆ తర్వాత 20 శాతం వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లులు మంజూరుచేయకపోవడంతో చేతులెత్తేశాడు. రోజులు గడుస్తున్నా అప్పటి ప్రభుత్వం నిధులు మాత్రం మంజూరు చేయలేదు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.208.25 కోట్లు కేటాయించింది.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూడా బడ్జెట్‌లో భారీగా నిధులు దక్కాయి. కొన్ని ప్రాజెక్టులకు గతేడాదితో పోలిస్తే ఎక్కువ నిధులను ప్రభుత్వం కేటాయించింది. తద్వారా బిల్లుల సమస్యతో అర్ధాంతరంగా ఆగిపోయి ఉన్న పనుల్లో కదలిక రానుంది. సోమశిల ప్రాజెక్టుకు రూ.208.25 కోట్లు కేటాయింపులు జరిపారు. దీంతో ఆప్రాన్ పనులు వేగం పుంజుకోనున్నాయి. అదే సమయంలో ఇతరత్రా ఎమర్జన్సీ పనులను కూడా చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. అలానే పెన్నార్ డెల్టా కెనాల్ సిస్టమ్‌కు రూ.33.42 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో కాలువలను అభివృద్ధి చేయనున్నారు. కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ.11 కోట్లు కేటాయించారు. గతేడాది కూడా రూ.11.54 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పొదలకూరు, చేజర్ల మండలాల ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం చాలా ముఖ్యమైనది. సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు బడ్జెట్‌లో రూ.66 కోట్లు కేటాయించారు. కనుపూరు కాలువ ఆధునికీకరణకు రూ.7 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు.



ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ)కు రూ.879.24 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అందులో నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని ఈ ప్రాజెక్టుకు రూ.453.17 కోట్లు దక్కనున్నాయి. గత ఏడాది కేటాయింపులతో పోలిస్తే ఇది సుమారు రూ.200 కోట్లు అధికం కావడం గమనార్హం. ఈ కేటాయింపులతో ఇప్పటి వరకూ బిల్లుల పెండింగ్‌తో ఆగిపోయిన సోమశిల-కండలేరు వరద కాలువ విస్తరణ వంటి కీలక పనులు ఊపందుకోనున్నాయి.



● పారిశ్రామికాభివృద్ధికి ఊతం

వ్యవసాయం తర్వాత జిల్లాలో ప్రధానమైన రంగం పారిశ్రామిక రంగం. ఈ రంగానికి కూడా కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆశించిన

- మిగతా 6లో..

ప్రకృతి అందం.. చరితకు అద్దం

ఉదయగిరి.. జిల్లాలో పడమర దిక్కున ఆ మూలకు విసిరేసినట్లు ఉన్నా ఘనమైన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం. శతాబ్దాల క్రితం సామ్రాజ్యాధినేతలు నిర్మించిన దుర్భేద్య దుర్గం, అందులోని అద్భుత కట్టడాలు, శిల్పకళా చాతుర్యం చారిత్రక వైభవానికి చిహ్నాలు. వీటికితోడు చుట్టూ చిక్కటి అడవి, జలజలపారే జలపాతాలు పర్యాటకులను, చరిత్రకారులను తరచూ ఆహ్వానిస్తూనే ఉంటాయి.

6



ఫైళ్లు దొరికాయ్ : కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో, రూరల్ తహసీల్దారు కార్యాలయాల్లో ఇప్పటి వరకు కనిపించని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబం భూ వివాదానికి సంబంధించిన ఫైళ్లు దొరికాయని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నెల్లూరులోనూ మదనపల్లె' శీర్షిక సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవడంతో కలెక్టర్ స్పందించారు. కనిపించలేదని ఆర్డీవో లేఖ రూపంలో తెలియజేసిన ఫైళ్లు.. ఎక్కడు న్నాయో వెతికి తనకు తెలిజేయాలని ఆర్డీవో, రూరల్ తహసీల్దారు కార్యాలయ అధికారులను ఆదేశించారు. దీంతో ఈ రెండు కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు విస్తృతంగా వెతికారు. ఎట్టకేలకు 596 పేజీలు కలిగిన ఫైల్ నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలోనూ, 162 పేజీలు కలిగిన ఫైల్ నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయంలోనూ లభ్యమైంది. ఈ విషయాలను సంబంధిత అధికారులు కలెక్టర్ ఆనంద్‌కు నివేదిక అందజేశారు. దీంతో ఈ రెండు ఫైళ్లు ఆయా కార్యాలయాల్లో లభ్యమయ్యాయని, ఆ ఫైల్స్‌లో ఉన్న ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.



భారీ గుంతలతో దారుణంగా మారిపోయిన ఆత్మకూరు-సోమశిల రోడ్డు

ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లు బాగు చేసి ప్రజల కష్టాలు తీర్చాల్సిందిపోయి ఓ కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తున్నారు. అత్యంత నాసిరకంగా రోడ్డు నిర్మించారని స్వయంగా క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ తేల్చారు. మరోసారి రోడ్డు వేయాల్సిందేనని, కాబట్టి కాంట్రాక్టర్ నుంచి పూర్తి బిల్లులు రికవరీ చేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ చెప్పినట్టుగానే ఆత్మకూరు-సోమశిల రోడ్డు వేసిన ఆరు నెలలకే దారుణంగా మారిపోయింది. గడిచిన ఎనిమిదేళ్లలో మరింత గుంతలమయంగా తయారైంది. కానీ ఇంతవరకూ కాంట్రాక్టర్ నుంచి పైసా రికవరీ చేయలేదు. పైగా ప్యాచ్ వర్కులతో సరిపెడుతున్నారు. తాజాగా మరో రూ.40 లక్షల ప్రజాధనాన్ని ప్యాచ్ వర్కులకు ఖర్చు చేస్తున్నారు తప్ప సదరు కాంట్రాక్టర్ నుంచి మాత్రం ప్రజాధనాన్ని రికవరీ చేయడం లేదు.

ఫైలు తొక్కిపెట్టి.. రూ.కోట్లు కొల్లగొట్టి!

ఎనిమిదేళ్ల క్రితం ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు రిజెక్ట్

రూ.8 కోట్ల రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం

సీఈ ఆదేశించినా బేఖాతర్

బీజీ రెన్యూవల్ చేస్తూనే ఉన్న ఆర్‌అండ్‌బీ అధికారులు

తాజాగా రూ.40 లక్షలతో ప్యాచ్‌వర్కులు?

నెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి తొమ్మిదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కిలోమీటర్ 17 నుంచి 40 వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా, రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. దీంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారణకు వచ్చారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదని నిర్ధారించారు. దీంతో వర్కునే రిజెక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.8 కోట్ల బిల్లులు చెల్లించారు. దీంతో ఆ బిల్లులను రికవరీ చేయాలని క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫారసు చేశారు. ఇదంతా జరిగి ఎనిమిదేళ్లు కావస్తోంది. కానీ ఆ ఫైల్ ఇప్పటికీ బయటకు రాకుండా తొక్కి పెట్టారు.

● కాగ్ అక్షింతలు వేసినా!?

గతేడాది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) అధికారులు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఆత్మకూరు-సోమశిల రోడ్డు రిజెక్ట్ వర్కును కూడా ఆడిటింగ్ చేశారు. దీనిపై సదరు అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నుంచి ఎందుకు రికవరీ చేయలేదు? వర్కును ఎందుకు క్లోజ్ చేయలేదు? క్లోజ్ చేయకుండానే మళ్లీ టెండర్లు పిలుస్తూ ఎలా ప్యాచ్‌లు వేస్తున్నారు? వంటి అనేక ప్రశ్నలు వేయగా అధికారుల నుంచి సమాధానాలు లేవు. ఈ వ్యవహారంపై ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి వివరణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. కాగ్ అక్షింతలు వేసి ఏడాది దాటినా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల్లో చలనం లేదు.

● విరుద్ధంగా బీజీ రెన్యూవల్

సాధారణంగా ఒక వర్కుకు టెండర్ వేసేటప్పుడు బ్యాంకు గ్యారెంటీ(బీజీ)ను అందజేయాలి. సదరు కాంట్రాక్టర్ వర్కును పూర్తి

- మిగతా 6లో..



సోలార్ విద్యుత్‌తో బంతి సాగు

అంతా పసుపువర్ణంలో కనిపిస్తున్న ఇది బంతితోట. అయితే విశేషం ఏమంటారా..? ఈ చిత్రంలో సోలార్ ప్యానెల్ ఉంది గమనించారా..? సోలార్ విద్యుత్‌తో మనుబోలు మండలం కుడితిపల్లికి చెందిన గుండె బోయిన ప్రసాద్ అనే రైతు ఇలా బంతిపూల సాగు చేపట్టాడు. ఉద్యాన, వ్యవసాయ, విద్యుత్ శాఖల పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆయన సాగులో ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

పరమేష్టికి పారిజాత శోభ

బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం గంగ తిప్పపై వెలసిన పురాతన శివలింగానికి సోమవారం భక్తులు పారిజాత పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కార్తీకమాస పర్వదినం సందర్భంగా ఈ అలంకరణ చేపట్టినట్లు భక్తులు తెలిపారు.



బస్టాండే బారు!

బుచ్చి మండలం పెనుబల్లి జెండా సెంటర్‌లో బస్ షెల్టర్ ఉంది. దాన్ని ఓ దుకాణం నిర్వాహకుడు సగం ఆక్రమించగా, కొంతమంది మందుబాబులు పట్టపగలే అక్కడ మద్యం సేవిస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్‌షెల్టర్‌లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పగలే ఇలా ఉంటే రాత్రయితే పరిస్థితి చెప్పనక్కరలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



అలనాటి వైభవం

ప్రకృతి అందం చరితకు అద్దం



శత్రు దుర్భేద్యమైన కోటలు, అబ్బురపరిచే రాజ ప్రాసాదాలు, రాణి వాసాలు, ఆకాశాన్నంటే వందలాది బురుజులు, ఎత్తయిన ప్రాకారాలు, కళానైపుణ్యాన్ని చాటే ప్రార్థనా మందిరాలు, అద్దాల మేడలు, ఆధ్మాత్మికత నింపే ఆలయాలు, వేద పాఠశాలలు, విస్మయపరిచే యుద్ధశిక్షణ కేంద్రాలు, ధాన్యాగారాలు, అశ్వగజశాలలు, గోషా మహల్, సొరంగ మార్గాలు .... వెరసి చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఉదయగిరి దుర్గం. సముద్ర మట్టానికి 3079 అడుగుల ఎత్తులో తిరుమల గిరులను పోలిన కొండలు, దట్టమైన అడవులు, ప్రవహించే సెలయేళ్లు, ప్రకృతి రమణీయత నిండిన పర్యాటక ప్రాంతం. ఎందరో రాజులు, నవాబులు, ఆంగ్లేయుల పాలనకు కేంద్రంగా విరాజిల్లిన చారిత్రక ప్రదేశం.

● రాజరికపు చిహ్నం.. ఉదయగిరి దుర్గం | ● శతాబ్దాలనాటి కట్టడాలు | ● పచ్చని వనాలు, పారే సెలయేళ్లు | ● పర్యాటకులకు ఆహ్లాదం | ● చరిత్ర శోధకులకు విజ్ఞానం



ఉదయగిరిలో క్రీ.శ 10వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు చోళులు, పల్లవులు, ఆనక రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబుల పాలన సాగినట్లు చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. విజయనగరాధీశుల ఏలుబడిలో 365 ఆలయాలు, వాటి ముంగిట కోనేర్లతో ఉదయగిరి దేదీప్యమానంగా వెలుగొందింది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఆ 365 ఆలయాల్లో రోజూ దేవుడి పెళ్లితో నిత్య కల్యాణం.. పచ్చ తోరణంగా బాసినట్లు చరిత్ర చెబుతోంది. బ్రిటీషు వారి హయాంలో ఏర్పాటైన సబ్‌జైలు ప్రాంగణంలోని భవనాల్లో ప్రస్తుతం తహసీల్దారు, ఉప ఖజానా, సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు కొనసాగుతూ ఆంగ్లేయుల నిర్మాణ శైలిని చాటుతున్నాయి. ఉదయగిరి దుర్గాన్ని సంజీవని గిరి అంటారు. మనుసును రంజింపచేసే కొండలు, లోయలు, పచ్చనిచెట్లు, పక్షుల కిలకిలరావాలు, దుమికే జలపాతాలతోపాటు మనిషికి ప్రాణం పోసే సంజీవని వంటి వనమూలికలు ఇక్కడున్నాయి. మసీదులకు వెళ్లే మెట్ల దారి, టప్పా, హను మాన్ నాలా, లొద్ది, తొట్టి ప్రాంతాలు పర్యాటకుల మనుసును దోచుకొంటా యి. ఎన్నో ఫిరంగి గుళ్ల చప్పుళ్లను, అలనాటి ప్రాభవాలను కాలగర్భంలో దాచుకొన్న ఉదయగిరి చరిత్ర శోధకుల కు విజ్ఞాన ఖనిగా పేరు సంపాదించుకొంది.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



ఉదయగిరి దుర్గంపై నీటి తొట్టి (టప్పా),



రంగనాయకులస్వామి ఆలయం



శతాబ్దాల నాటి నిర్మాణ శైలికి నిదర్శనంగా కొండమీదున్న చిన్నమసీదు

నువ్వెంతంటే నువ్వెంత!

● ఇద్దరు అధికారుల ఘర్షణ

● వెంకటాచలంలో ఆలస్యంగా వెలుగులోకి..

వెంకటాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం తహసీల్దారు కార్యాలయంలో రెండు రోజుల క్రితం ఇద్దరి అధికారుల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అన్నస్థాయిలో తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. రైతులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బంది అందరూ చూస్తుండగానే వారి మధ్య కలబడేంత స్థాయిలో వివాదం సాగింది. ఒకానొకదశలో 'నీ సంగతి నాలుగు రోజుల్లో తేల్చేస్తా'నంటూ సవాళ్లు విసురుకున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అండతో వచ్చిన మండల స్థాయి రెవెన్యూ అధికారి తహసీల్దారు కార్యాలయంలో అంతా తానై చక్రం తిప్పుతున్నారు. మూడు నెలల క్రితం మండల ఉన్నతాధికారిగా మరొకరు బాధ్యతలు చెప్పారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడినా గత ప్రభుత్వ హయాంలో పని చేసినట్టే ఆ అధికారి చేస్తున్నారు. అంతేగాక పలు ఆరోపణలు వెల్లువత్తాయి. రెండు రోజుల క్రితం కంటేపల్లిలో ఒక రైతు తన పొలం విషయమై ఓ మహిళా అధికారిని సంప్రదించగా ఆమె నుంచి రైతుకు చెందిన ఫైలు మండలస్థాయి అధికారి వద్దకు చేరింది. దీంతో తనపై సదరు అధికారి దురుసుగా ప్రవర్తించాడంటూ ఆమె ఉన్నతాధికారికి విషయం చెప్పింది. దీంతో ఇద్దరు అధికారుల మధ్య పెద్దఎత్తున వివాదం తలెత్తింది. అందరూ చూస్తుండగానే ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. వివాదం పెద్దదవుతున్న తరుణంలో అక్కడే ఉన్న సిబ్బంది సర్దిచెప్పడంతో ఇద్దరూ శాంతించారు. ఈ వివాదం కాస్త మండలవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీనిపై తహసీల్దారు శ్రీనివాసులును అడగగా అదంతా ఏమీ లేదంటూ చెప్పడం విశేషం.

జర్మనీ భాషపై శిక్షణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు ఎస్‌ఎం కేర్ సొల్యూషన్స్ జీఎంబీహెచ్ వారు జర్మనీ భాష నేర్పించి ఆ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, జర్మనీ భాష నేర్చుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి తిరుప తిలో ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అందుకు ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల ని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9988853335కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రూ.కోట్లు కొల్లగొట్టి

(5వ పేజీ తరువాయి)

చేసి నిర్వహణ పీరియడ్ కూడా ముగిశాక సదరు బీజీని అధికారులు తిరిగి ఇచ్చేస్తారు. నిర్వహణ పీరియడ్ రెండేళ్లు ఉంటుంది. అప్పటితో ఆ వర్కు ముగిసినట్లవుతుంది. కానీ ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు విషయంలో ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు నాణ్యత లోపంగా పనులు చేసిన కాంట్రాక్టర్ బీజీను ఏటా రెన్యువల్ చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కూడా సుమారు రూ.55 లక్షల బీజీలను ఠంచ నుగా రెన్యువల్ చేసి ఇస్తున్నారు. ఈ వ్యవహా రంలో పైనుంచి కింది స్థాయి వరకు భారీగానే చేతులు తడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా బీజీను రెన్యువల్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

● ప్యాచ్‌లతో సరి

ఒక వర్కు బీజీను రెన్యువల్ చేస్తున్నారంటే ఆ వర్కు ఇంకా ఫోర్స్‌లో ఉన్నట్లు అర్థం. కానీ ఇక్కడ వర్కు మాత్రం రిజెక్ట్ అయ్యింది. బీజీలు మాత్రం రెన్యువల్ అవుతున్నాయి. ఈ కారణంగానే మళ్లీ కొత్తగా వర్కు మంజూరు చేసి రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేసేందుకు సాధ్యపడటం లేదని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా పలుమార్లు టెండర్లు పిలిచి ప్యాచ్ వర్కులు మాత్రం చేశారు. ఇప్పుడు కూడా మరో రూ.40 లక్షలతో ప్యాచ్‌లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఈ రికవరీ ఫైల్‌ను ఇప్పటివరకూ ఉన్నతస్థాయిలో పనిచేసిన కొందరు అధికారులు తొక్కిపెడుతూ వస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజలు మాత్రం గుంతల రోడ్లపై నరకం అనుభవిస్తుంటే.. అధికారుల తీరుతో కాంట్రాక్టర్ మాత్రం ప్రజాధనంతో దర్జాగా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ వ్యవహారంపై దృష్టి పెట్టి ఆత్మకూరు - సోమశిల రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాలి

ఆత్మకూరు-సోమశిల రోడ్డు నాణ్యతగా లేదని గతంలో సీఈ రిజెక్ట్ చేసిన ఫైల్ రాష్ట్ర స్థాయిలో ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిబంధనల ప్రకారం బీజీలు రెన్యువల్ చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్యాచ్‌లు వేస్తున్నాం.

- ఎం గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నెల్లూరు (వైద్యం) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగంలో ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని జరిగిన సీపీఎం ప్రజాపోరు ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వదిలిన చెప్పుల్లోనే కాళ్లుపెట్టి కూటమి ప్రభుత్వం పరిపాలిస్తున్నదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీలు విధించినప్పుడు బాదుడే బాదుడు అని కూటమి నాయకులు ఆందోళనలు చేపట్టారన్నారు. మరి ఇప్పుడేమే ప్రజలపై రూ. 17వేల కోట్ల భారం మోపడం సరికాదన్నారు. తక్షణమే ట్రూ అప్ చార్జీల భారాన్ని విధించే చర్యలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకుంటామని గత ప్రభుత్వ హయంలో చెప్పిన టీడీపీ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌మీటర్లు వేగవంతంగా బిగిస్తున్నారని ఆయన విమర్శించారు. చెప్పేదొకటి.. చేసేదొకటిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. తక్షణమే ఈ చర్యలు ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈనెల మూడవ వారంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలని కోరారు. నెల్లూరులో ప్రజాపోరుకు విశేష స్పందన వస్తున్నదని పేర్కొన్నారు. 70శాతం మంది పేదలు నివసించే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ పట్టాలు లేవని, ఇంకా ఉచిత ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న కలెక్టరేట్ల వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, సూర్యనారాయణ, బీపీ నరసింహ, కత్తి పద్మ, మూలం ప్రసాద్, అత్తిమూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాసుల గలగల

(5వ పేజీ తరువాయి)

మేర నిధులను కేటాయించింది. కీలకమైన రామాయపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. అలానే కృష్ణపట్నం పోర్టు ప్రభావిత ప్రాంతాల్లో పరిహారం కోసం రూ.37.98 కోట్లు కేటా యింపులు జరిపింది. పారిశ్రామిక అభి వృద్ధిలో కీలకమైన విశాఖ-చెన్నై ఇండస్ట్రి యల్ కారిడార్‌కు కూడా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఈ కారిడార్ పరిధిలో భూములు కొనుగోలు చేసి ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు గానూ ఏపీఐఐసీకు రూ.210.91 కోట్లు కేటాయింపులు జరిపింది. అలానే రోడ్ల అభివృద్ధికి గానూ ఏపీఆర్‌డీసీకు రూ.66.97 కోట్లు, విద్యుత్ వసతి కల్పనకై ఏపీ ట్రాన్స్‌కోకు రూ.104.09 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపులతో ఇండస్ట్రియల్ కారిడార్ పనుల్లో మళ్లీ వేగం పుంజుకోనుంది. ఇక విక్రమ సింహపురి యూనివర్సిటీ అభివృద్ధికి రూ.20.69 కోట్లను వెచ్చించేలా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గతేడాది రూ.13.90 కోట్లు కేటాయించగా ఈ దఫా కేటాయింపులు పెరిగాయి. ఇవే గాక ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు కూడా భారీగానే నిధులు కేటాయించారు. దీని ఫలితంగా పెండింగ్ బిల్లులు చెల్లిస్తే అసంపూర్తిగా ఆగిపోయిన రోడ్లు, భవనాల పనులు మొదలుకానున్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

కుటుంబం ఉన్నతికి విద్యే మూలం

● మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు కలెక్టర్ ఘన నివాళి



మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుటుంబం ఉన్నతంగా ఎదగాలంటే విద్యే మూలమని గ్రహించిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నో విద్యా సంస్థలకు అంకురార్పణ చేసి ప్రోత్సహించారని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వాంతంత్ర సమర యోధుడు ఆజాద్ హిందూ, ముస్లింల ఐక్యతకు ఎంతగానో కృషి చేశారన్నారు. అనేక వ్యాసాలు, కథనాల ద్వారా జాతిలో స్వాంతంత్ర కాంక్షను రగిలించాన్నారు. ఆయన ఆలోచనలు, ప్రణాళికలు నేటికీ ఆచరణీయమన్నారు.

యువతకు ఆదర్శం - వేమిరెడ్డి దంపతులు

స్వాతంత్ర్య సమర యోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు నేటి యువతకు ఆదర్శనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికా విద్యకు పెద్ద పీట వేశారని కొనియాడారు.

ఇదే స్కూల్ బస్సు!



ఆ ఊరికి ఆర్టీసీ బస్సుల్లేవు. ఒకప్పుడు వస్తున్నా ప్రస్తుతం రావడం లేదు. మండల కేంద్రం వెంకటాచలానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామం కందలపాడు. ఊరి నుంచి 50 మందికిపైగానే విద్యార్థులు ప్రతినిత్యం కనుపూరు, నెల్లూరులోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ట్రాక్టర్లు, ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా ఏం చేయలేని నిస్సాయస్థితి వారిది. బిడ్డలను చదివించుకోవడం కోసం తల్లిదండ్రులు ఈ సాహసం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగచేసుకుని విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)

రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఎంత!?

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్ల నాణ్యతను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం విజిలెన్స్ ఎస్పీ పీఆర్ రాజేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డులో నాణ్యత తనిఖీ చేసి నమూనాలు సేకరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఈఈ మహిత, ఏఈఈ అవినాష్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ అధికారులు, సిబ్బంది సురేష్, శివకృష్ణ, తదిత రులు పాల్గొన్నారు.



ఈ రికార్డులు భద్రమేనా?

స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు భద్రపరిచే గది శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే ఉరుస్తూ చెదలుపట్టి పనికిరాకుండా పోగా.. ప్రస్తుతం విలువైన రికార్డులు భద్రపరిచే పరిస్థితి లేదు. దీంతో కార్యాలయంలో పలుచోట్ల రికార్డులు గుట్టలుగా పడేశారు. గతంలో ఈ కార్యాలయంలో పలు ముఖ్యమైన ఫైల్స్ గల్లంతైనట్లు సమాచారం. మండలంలో గతంలో జరిగిన భూకుంభకోణాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు ఫైల్స్ గల్లంతుచేసి ఉంటారని కూడా అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ రికార్డులకు భద్రత ఎంతో అధికారులకే తెలియాలి.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

సోమశిల ఉత్తర కాలువలో పడి రైతు మృతి

అనంతసాగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కాలువలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆమనిచిరివేళ్లకు చెందిన షేక్ మస్తాన్‌వలి (56)కి కాలువ పక్కన పొలం వుంది. కాలువ నుంచి నీరు తోడుకొనే విధంగా పైపు ఏర్పాటు చేసుకుంటూ ప్రమాద వశాత్తు కాలువలో పడ్డాడు. దీంతో స్థానికులు గమనించి అతని కోసం గాలించగా కొంత దూరంలో మస్తాన్‌వలి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు.

చెరువులో పడి విద్యార్థి దుర్మరణం



దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేర కు.. వెంకటంపేటకు చెందిన పందిళ్ల గురుచరణ్ (16) నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ తున్నానని తన చెల్లెలికి చెప్పి ఇంటినుంచి వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో తల్లి దండ్రులు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ తెలియలేదు. సోమవారం అనుమానం వచ్చి గ్రామస్థులు, తల్లిదండ్రులు చెరువు వద్దకెళ్లి తూము ద్వారా నీటిని బయటకు పంపారు. నీరు బయటకు వెళ్లగానే గురుచరణ్ మృతదేహం కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ.మాల కొండయ్య సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి, తెలుపు, నలుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్ షర్ట్, తెలుపు, బ్లూ కలర్ గీతల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని టూరిస్టు బస్సు డ్రైవర్...

కావలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గౌరవరం జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాచలం మండలం నిడిగుంట పాటిమీద హరిజనవాడకు చెందిన టూరిస్టు బస్సు డ్రైవర్ మరియు ఓనర్ గుండాబత్తిన లోకేష్ (31) మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. లోకేష్ రెండు ప్రయివేటు బస్సులను అద్దెకు నడుతున్నాడు. అప్పుడప్పుడూ డ్రైవర్ డ్యూటీగా వెళతాడు. అందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం అల్లూరు మండలం శంభనివారిపాలెం నుంచి లోకేష్ బస్సులో పెళ్లి వారిని తీసుకుని ప్రకాశం జిల్లా కొత్తపట్నం వెళ్లాడు. పెళ్లి అనంతరం అర్ధరాత్రి సమయంలో శంభనివారిపాలెంకు తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యంలో గౌరవరం సమీపంలో బస్సును రోడ్డు మార్జిన్‌లో ఆపి దిగాడు. ఈ సమయంలో ఒంగోలు నుంచి నెల్లూరు వైపుకు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి లోకేష్‌ను ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రగాయాలైన లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ జి.రాజేశ్వరరావు హైవే పోలీసులను అప్రమత్తం చేయడంతో నెల్లూరు వద్ద కారును నిలిపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ప్రశాంతి, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మనుబోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనుబోలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మడమనూరుకు చెందిన ఉప్పు యశ్వంత్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫోన్‌లో వచ్చిన పీడీఎఫ్ ఫైల్స్‌ను జెరాక్స్ తీసుకునేందుకు మోటార్‌సైకిల్‌పై గూడూరుకు వెళుతున్నాడు. మనుబోలు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దూడల విజయలక్ష్మి తన చెల్లెలు నెల్లూరు నుంచి కారులో వస్తుందని, బైపాస్‌లో ఆగుతానని చెప్పడంతో చూసేందుకు రోడ్డు దాటుతోంది. ఒక్కసారిగా ఆమె రోడ్డుపైకి రావడంతో వేగంతో వస్తున్న మోటార్‌సైకిల్‌ను అదుపుచేయలేక యశ్వంత్ ఆమెను ఢీకొని పడిపోయాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో మరొకరి అరెస్టు

నెల్లూరు(క్రైం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య కేసులో మరో నిందితురాలిని సంతపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఎం.రమణి(65) ఈనెల 4న ఉదయం కూరగాయలు కొనుగోలుకు సమీపంలోని దుకాణానికి వెళ్లగా అదేప్రాంతానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం, అతని కుమార్తె ఆమెను ఇంటికి పిలిచి హత్య చేసి మృతదేహాన్ని ముక్కలు చేసి సూట్ కేసులో పెట్టుకుని చెన్నైకి వెళ్లి అక్కడి పోలీసులకు చిక్కిన విషయం విదితమే. ఈ కేసును సమగ్ర విచారణ చేపట్టిన సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్ఐ బాలకృష్ణలు వృద్ధురాలి హత్యను బాలసుబ్రమణ్యం కుటుంబం అంతా కలసి చేసిందన్న నిర్ధారణకు వచ్చారు. తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పోలీసులు తండ్రి, కుమార్తెను అరెస్ట్ చేయగా మరో నిందితురాలైన సత్యవతిని అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 50 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాంకు ఖాతాల్లో రూ.1,66,365 నగదు మాయం

● సైబర్‌క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ఉదయగిరి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి పంచాయతీ సంజీవరాజుపల్లి గ్రామానికి బడబాగ్ని ఆంజనేయరాజు అనే రైతుకూలి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయమైన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆంజనేయరాజు సెల్‌ఫోన్‌లోని సిమ్ ఈనెల 4న మరమ్మతులకు గురికావడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. నూతనంగా మరో సిమ్ తీసుకొని ఈనెల 9న తన ఫోన్‌లో వేశాడు. ఫోన్ ఆన్ చేయగానే ఈనెల 6, 7, 8, 9వ తేదీల్లో కెనరా బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1,62,465 లక్షలు, స్టేట్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.3,900 కలిపి మొత్తం రూ.1,66,365 నగదు డ్రాచేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. వాటిని చూసి ఖంగుతున్న ఆంజనేయరాజు హుటాహుటిన ఆయా బ్యాంకులకు వెళ్లి విచారించారు. బ్యాంకు అధికారులు నగదు డ్రా విషయం తమకు తెలియదని చెప్పడంతో ఆందోళనకు గురయ్యాడు. కూలినాలి చేసుకొని బ్యాంకుల్లో దాచుకున్న నగదు ఓటీపీ చెప్పకుండా, బయోమెట్రిక్ వేయకుండా ఎలా మాయమైందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయమై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపడుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7423
వెండి కిలో ధర	రూ. 93,300
వెండి ఒక గ్రాము	రూ.96.30

కొండంత ఆశతో వస్తారు..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్

ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు వస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని కొండంత ఆశతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తారని, వారి సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందుతున్న అర్జీలను పరిశీలించి ఆయా సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ అర్జీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిష్కారం చూపకుండా అర్జీలను మూసివేయవద్దన్నారు. సమస్య పరిష్కరించకపోతే దానికి కారణం వివరించాలన్నారు. సోమవారం 350 మంది అర్జీలు సమర్పించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

● **పద్మశాలి సంఘం వినతి**

నెల్లూరు నగరంలోని గాంధీనగర్‌లో చేనేతలకు కేటాయించిన 6.90 సెంట్ల స్థలంలో కళ్యాణ మండపం, గదులు నిర్మించాలని కోరుతూ పద్మశాలి సంఘం జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాధయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవారపు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

● **ఆశాల వేతనం ఆపివేయడం సరికాదు**

నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): కలిగిరి మండలం కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 22 మంది ఆశాలకు నెల రోజుల వేతనం ఆపివేయడం అన్యాయమని కలెక్టర్ ఆనంద్‌కు ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ కలిగిరి మండలం రావులకొల్లులో ఆశా వర్కర్ పందిటి విజయమ్మను అకారణంగా తొలగించారన్నారు. దీనికి నిరసనగా పీహెచ్‌సీలోని ఆశాలు విజయమ్మను పనిలోకి తీసుకోవాలని 5 రోజుల పాటు నిరసన తెలిపారని చెప్పారు. ఇందులో పాల్గొన్న 22 మంది ఆశాల నెల రోజుల వేతనం ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అల్లూరు మండలం ఇస్కపల్లి, టీపీ గూడూరు మండలం కోడూరు పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఇద్దరు ఆశాల వేతనాలు కూడా నిలుపుదల చేశారన్నారు. వెంటనే ఆశాల నెలవారి వేతనం పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సహకార వారోత్సవాలు

● పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తిక్కన భవన్‌లో సహకార వారోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీసీవో గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులపై త్వరగా స్పందించండి

● పీజీఆర్ఎస్‌లో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 98 మంది బాధితులు వినతులు అందజేశారు.

● ఒక రూ.లక్షకు రూ.రెండు లక్షలు ఇస్తామని నమ్మించి నెల్లూరుకు చెందిన కర్తీక్‌రెడ్డి, సుధాకర్‌లు కోటి అనే మధ్యవర్తి ద్వారా 3 ఏళ్ల క్రితం రూ.20 లక్షలు తీసుకుని మోసం చేశారని హైదరాబాదుకు చెందిన బాధిత మహిళలు ఊర్మిళ, సునీత, అంజలిలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. డబ్బులు అడిగితే ఇవ్వకుండా బెదిరిస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎస్పీ వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని రూరల్ డీఎస్పీని ఆదేశించారు.

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని గౌతమి, హేమంత్ గౌతమ్ అనే వ్యక్తులు రూ.4.50 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా మోసం చేశారని వేదాయపాలెంకు చెందిన బాధిత ముంతాజ్ కుమారుడు శశిధర్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

● మనుబోలుకు చెందిన రైతు సురేష్ అదే ప్రాంతానికి చెందిన ప్రసన్న కుమార్‌రెడ్డికి రూ.76 లక్షల విలువ చేసే ధాన్యం విక్రయించగా నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని బాధితుడు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారించాలని రూరల్ డీఎస్పీని ఎస్పీ ఆదేశించారు.



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల ధర్నాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం దళిత సంఘర్షణ సమితి, బీజేపీ నాయకులు వేర్వేరుగా ధర్నా చేశారు.

● **మహిళ భూమిని కాపాడండి**

కలిగిరి మండలం ఎలుకలరెడ్డిపాళెంలో మొనగాల తులసమ్మకు చెందిన భూమిని కొందరు ధ్వంసం చేశారని, ఆ భూమిని ఆమెకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆధ్వర్యంలో బాధితులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు దాసు, గుడి అంకయ్య, హజరతయ్య, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

● **కిడ్నీ వ్యాధిగ్రస్థులను కాపాడాలి**

ఉదయగిరి నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతాల్లో సరైన నీటి వసతి లేక పోవడం వలన ప్రజలు కిడ్నీ వ్యాధిన పడుతున్నారని, వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల చేసి ఆ ప్రాంత వాసులను కిడ్నీ వ్యాధుల నుంచి కాపాడాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ మెట్టప్రాంతాల్లో భూగర్భ జలాలతో సేద్యం చేస్తున్నందున ఆ జలాలలోని కాపర్, మెర్క్యురీ లెడ్ స్థాపస్యం మిశ్రమాల వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. వెలుగొండ, పెద్దిరెడ్డి పల్లి రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేసి పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు అల్లూరు నాగేంద్రసింగ్, సాయి శ్రీనివాసులు, సున, ఆదినారాయణ, నీలిశెట్టి లక్ష్మణరావు, కె.వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాల్లో సోమవారం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరు డీబార్ అయ్యారని పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 5042 మందికిగానూ పరీక్షలకు 4731 మంది హాజరు కాగా, 311 మంది గైర్హాజరయ్యారు. నాయుడుపేటలోని వేమా డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు ఆయన తెలిపారు.

బాలల వసతి గృహాల్లోని పిల్లలను తీసుకెళ్లాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు బాలల వసతి గృహాల్లో సంరక్షణ నిమిత్తం ఉంచిన ఏడుగురు పిల్లలను సోమవారం నుంచి 30 రోజులలోగా వారికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు తగిన సాక్ష్యాధారాలతో వచ్చి తీసుకెళ్లాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 రోజుల లోగా వారి తల్లిదండ్రులు రాకపోతే ఆ పిల్లలను అనాథ పిల్లలుగా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆ పిల్లల ఫొటోలను విడుదల చేసిన ఆమె పూర్తి వివరాలకు నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం సేకరించిన భూముల యజమానులైన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శంకరన్ హాల్ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్మీ, మాజీ సైనికులకు నిబంధనల ప్రకారం భూములు కేటాయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వారం రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. పూర్తయిన గృహాలకు బిల్లులు చెల్లించాలన్నారు. పల్లె పండుగలో చేపట్టిన పనులను జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

భవ్యకు రూ.10 లక్షల బాండ్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన ముత్తుకూరుకు చెందిన టీ.భవ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల బ్యాంక్ బాండ్‌ను ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి భవ్య తల్లిదండ్రులు 2021లో కరోనాతో మరణించారన్నారు. దీంతో ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం మంజూరు చేసిందన్నారు. ఈ పరిహారాన్ని స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీ భవ్య తీసుకునే వెసలు బాటు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



భవ్యకు బ్యాంకు బాండ్ అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

తలసేమియా ఆసుపత్రి కోసం రూ.1.26 లక్షల విరాళం

ఆసుపత్రిని ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దుతాం: ఆర్డీవో

కావలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తలసేమియా ఆసుపత్రి నిర్వహణకు సోమవారం కావలికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు యాలమూరి కొండారెడ్డి ఆయన సతీమణి విశ్రాంత ఉపాధ్యాయురాలు అరుణ భారతిదేవిలు ఆర్డీవో వంశీక్రిష్ణకు రూ.1,26,000లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో త్వరలో ప్రారంభం కానున్న తలసేమియా ఆసుత్రిని ఆదర్శకేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దాతలు ముందుకొచ్చి విరాళాలు అందచేసి తలసేమియా బాధిత బాలల ప్రాణాలను కాపాడాలని కోరారు. అనంతరం దాత కొండారెడ్డి మాట్లాడారు. కావలిలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు హర్షణీయమన్నారు. అనంతరం దాత కొండారెడ్డిని ఆర్డీవో సత్కరించారు. కార్యక్రమంలో తలసేమియా ఆసుపత్రి కేంద్ర కన్వీనర్ హరి నారపరెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ. రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ పరిపాలనాధికారి బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఆర్డీవోకు చెక్కు అందజేస్తున్న కొండారెడ్డి

మడపల్లిలో భూవివాదం

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం

చేజర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడపల్లి గ్రామంలో భూవివాదం నేపథ్యంలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పూర్తి వివరాల మేరకు... మడపల్లి గ్రామ సమీపంలో పినాకిని షీఫామ్స్ పేరుతో ఉన్న భూమికి సంబంధించి శ్రీనివాసులురెడ్డి, అజయ్ గోష్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. అయితే రికార్డులు అన్నీ తమ పేరుతో ఉన్నాయని సోమవారం శ్రీనివాసులురెడ్డికి చెందిన వ్యక్తులు అందులో ఉన్న జామాయిల్ చెట్లను నరికే కార్యక్రమం చేపట్టగా ఈ విషయం తెలుసుకున్న అజయ్‌గోష్ స్థానికులు కొంతమందితో కలిసి అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అక్కడ ఉన్న వారిని తరిమివేశారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జడ్పీ కాలనీలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని జడ్పీ కాలనీలో రమణారెడ్డి, అపర్ణ(42) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఓ కుమారుడున్నాడు. రమణారెడ్డి కాంట్రాక్టు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం అపర్ణ తన ఇంట్లోని ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

నేడు రాళ్లపాడు కాలువలకు నీటి విడుదల

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఆయకట్టు పరిధిలోని రైతులు నీటిని విడుదల చేయమని కోరుతున్న నేపథ్యంలో మంగళవారం రాళ్లపాడు ప్రాజెక్టు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి సోమవారం ప్రకటనలో తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారన్నారు.

నేడు గ్రద్దగుంటలో గ్రామసభ

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభను మంగళవారం గ్రద్దగుంటలో నిర్వహించనున్నట్లు తహసీల్దారు లక్ష్మీ నారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కొండాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల కాంప్లెక్స్‌ల పరిధిలో మంగళవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

కావలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మురుగుకాలువల్లో చెత్త తొలగింపు, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, శానిటరీ అధికారులను కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం 33వ వార్డులోని పెండెంవారి, చిత్తాతూరివారి వీధి, మల్లెవరపువారి వీధులు, పెద్దపవని రోడ్డలోని కమిషనర్ రోడ్లు, కాలువలను పరిశీలించారు.

దుప్పట్ల పంపిణీ

కావలిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌లైన్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం స్థానిక రైల్వేస్టేషన్, ఉదయగిరి బ్రిడ్జి, జనతాపేట, కలుగోళమ్మ గుడి ప్రాంతాల్లోని నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ తాటికొండ నవీన్ మాట్లాడారు. జేబీ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు షర్మిల దంపతుల సహకారంతో వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో దాత షర్మిల, సభ్యులు స్రవంతి, శశాంక్, సురేష్, సహస్ర పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల చోరీపై ఫిర్యాదు

కావలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌కు పడమర వైపున పార్కింగ్‌లో ఉంచిన రెండు మోటారు సైకిళ్ల చోరీకి గురైనట్లు బాధితులు జలదంకి మండలం అనుమకొండపాలెం కర్రా మల్లికార్జున్, నాగిరెడ్డిపాలెం కు చెందిన గొల్లమూరి శ్రీనివాసులు రెడ్డి సోమవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భర్త కనిపించటం లేదని ఫిర్యాదు

కావలి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పీజీ సెంటర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మేకల శ్రీనివాసులు కనిపించటం లేదని ఆయన భార్య జయమ్మ సోమవారం రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. అనారోగ్యంతో ఉన్న శ్రీనివాసులు ఈ నెల 7వ తేదీన నెల్లూరులోని వైద్యశాలకు అని చెప్పి వెళ్లాడని అప్పటి నుండి కనిపించటం లేదని జయమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 1.76 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ. 1.76 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ ఎస్సీ కాలనీలో రూ. 1.9 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, షేక్ మస్తాన్‌వలీ, వి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

కలువాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లి రైతు సాధికారక కేంద్రంలో సోమవారం రాయితీపై పచ్చిశనగ విత్తనాలు అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వీ ప్రతాప్, సర్పంచు జీ వెంకటరమణమ్మ, వెంకటేశ్వర్లు నాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి, సోమయ్య యాదవ్, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వారంలో విద్యుత్‌ను అందిస్తాం

● డీఈ శ్రీనివాసులు

ఏఎస్ పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పురుపాడు గ్రామంలోని పొలాల రైతులకు వారం రోజులలో విద్యుత్‌ను అందిస్తామని ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ కార్యాలయానికి విచ్చేసి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రూ. 16వేలు చెల్లించి ఏడాది గడుస్తున్నా పొలాలకు విద్యుత్ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో స్తంభాలకు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి వారం రోజులలో విద్యుత్ వచ్చేలా చేస్తామని డీఈ హామీ ఇచ్చారు. కనెక్షన్‌కి రూ. 16వేలు వసూలు చేయడంపై కూడా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో..!

● మూడేళ్లుగా నిలిచిన జలదంకి-తెల్లపాడు రహదారి పనులు
● డబుల్‌రోడ్డు నిర్మాణంలో ఉన్న సింగిల్ రోడ్డు ధ్వంసం
● గోతులతో ప్రయాణికుల ఇబ్బందులు


నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు


రోడ్డును తవ్వడంతో ఏర్పడ్డ గుంత

జలదంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి తెల్లపాడుకు వెళ్లే సింగిల్ ఆర్అండ్‌రోడ్డును మూడేళ్ల క్రితం రూ.20కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులతో రెండువరుసల రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేస్తూ టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మొదట్లో పనులు వేగవంతంగా చేశారు. వంతెనల నిర్మాణంలోని కల్వర్టులను తొలగించి వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మాణం ప్రారంభించారు. కొత్త వంతెనలు నిర్మించే చోట డైవర్షన్ రోడ్లు వేశారు. అలాగే బాగున్న సింగిల్‌రోడ్డుపై పలుచోట్ల అడ్డంగా గోతులు తీయడమే కాక రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేసేందుకు మెటల్‌తో నింపారు. ఇలారోడ్డు రూపురేకలు మార్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చేసిన పనులకు బిల్లులు గత ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు ఉన్నపలంగా రోడ్డు నిర్మాణం అపేసి కోర్టును ఆశ్రయించారు. ఇదంతా ఏడాదిలోపే జరిగిపోయింది. ఇక అప్పట్నుంచి నేటివరకు రెండేళ్లుగా ఈ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ధ్వంసం చేసిన రోడ్డును అలానే వదిలేశారు. వర్షాకాలంలో డైవర్షన్‌లు తెగి రాకపోకలకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రోడ్డును పలుచోట్ల నిర్మాణంలో భాగంగా తారుతొలగించగా అక్కడ గతుకులు ఏర్పడి వాహనరాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. గోతుల్లో పడి వాహనాలు ప్రమాదాల బారిన పడడమే కాకుండా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కొత్తప్రభుత్వంలోనైనా పనులు ప్రారంభం అవుతాయని గంపెడాశతో ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కనీసం గోతులనైనా పూడ్చి తాత్కాలిక మరమ్మతు

గృహనిర్మాణ శాఖలో వంద రోజుల కార్యాచరణ

● గౌస్‌మొహిద్దీన్, ఏఈ, హౌసింగ్



సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో చేపట్టిన పక్కాగృహాల నిర్మాణాలను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం వందరోజుల కార్యాచరణకు లక్ష్యాలు నిర్దేశించిందని గృహనిర్మాణ శాఖ ఏఈ ఎండీ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు.

? వందరోజులకు ఎన్ని గృహాలు పూర్తయ్యాయి.

! డిసెంబరు నెలాఖరుకు 362పక్కాగృహాలు పూర్తి చేయాలని నిర్దేశించి 105నిర్మాణాలు పూర్తిచేశాం. 257 పూర్తిచేయాల్సి ఉంది.

? సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందా.

! సిమెంట్, ఇనుము లబ్ధిదారులు అడిగితే తెప్పించి ఇస్తాం. అలాగే బిల్లులు కూడా వెంటనే అందచేస్తాం.

? జగనన్న కాలనీ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ ఏం తేల్చింది.

! కాంట్రాక్టర్లు నిర్మించిన ఎక్కువ శాతం ఇళ్లు నాసిరకంగా నిర్మించారని అధికారులు నివేదికలో తేల్చి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల వద్ద రికవరికీ నివేదించింది.

సమస్యలను పరిష్కరించండి సారూ..

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవోకు వినతుల అందజేత


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీసీ ఐక్యత భవన్ నేతలు

కావలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలదంకి మండలం లింగరాజు అగ్రహారంకు చెందిన రైతులు తమ వరి నారుమళ్లు ముదిరిపోతున్నాయని వరి నాట్ల కోసం సోమశిల నీటిని విడుదల చేయాలని కోరారు. చినక్రాక రిజర్వాయర్ నుంచి సోమశిల నీటిని మా కాలువలకు వదిలితే వరినాట్లు వేసుకుంటామన్నారు. అనంతరం డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలపై వినతులు ఇచ్చారు. విచ్చలవిడి మద్యంను నియంత్రించాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి సీపీఎం నాయకులతో కలిసి ఆర్డీవోకు వినతిప్రతం అందజేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచుతున్న విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణయ్య, సీతారామయ్య, మధు, కమలాకర్, సీతారాంసింగ్ పాల్గొన్నారు. పేద విద్యార్థుల కోసం కావలిలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని బీసీ ఐక్యతభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవింద్, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌లు వినతిలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డులు లేవని పొదుపు రుణాలు సకాలంలో చెల్లించినా బ్యాంకర్లు తిరిగి ఇవ్వడంలేదని కొందరు పొదుపు గ్రూపు సభ్యులు ఆర్డీవోకు విన్నవించారు.

ఇళ్లస్థలాలపై జరిగే ధర్నాను జయప్రదం చేయండి


కందుకూరు: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కందుకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నివాసస్థలాలు లేని పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో రెండుసెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు, పట్టణాలలో ఒక సెంటు ఇచ్చారనరి ఓ కుటుంబానికి ఇది ఏమాత్రం సరిపోదం లేదన్నారు. సమావేశంలో బాలకోటయ్య, ఆనంద్‌మోహన్, సీహెచ్ దుర్గాప్రసాద్, హరిబాబు పాల్గొన్నారు.

● **శాంతినగర్‌లో ప్రజాపోరు**

కావలి టౌన్, నవంబరు 11: సీపీఎం ప్రజాపోరు కార్యక్రమం సోమవారం స్థానిక 20వార్డు శాంతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలుకు కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలడిగి తెలుసుకున్నారు. మద్దూరుపాడులో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు తిరుపాల్, కృష్ణమోహన్, పెంచులయ్య, బాబురావు పాల్గొన్నారు.

● జలదంకి, నవంబర్ 11: గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబులు సోమవారం ఎంపీడీఓ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పడమటిడొరువును శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని, యాదవబజారులో వీధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

● **పెరిగిన ధరలు తగ్గించాలి**

అనంతసాగరం, నవంబరు 11: పెరిగిన నిత్యవసర సరుకులు, విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాపోరు ప్రచారయాత్రలో భాగంగా పలు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, సందాని, గాడి సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్ఆర్.పాలెం, పెంట్రాలలో వైద్యశిబిరాలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రమేష్

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఆర్ఆర్.పాలెంలో లింగసముద్రం వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి జ్వరాలు, ఇతరవ్యాధులపై సర్వే చేపట్టారు. వైద్యులు రమేష్ 13 మందికి కీళ్ల నొప్పుల రోగులకు మందులు అందజేశారు. ఇతర చిన్న వ్యాధులతో బాధపడే 73మందిని పరీక్షించారు. గ్రామ సర్పంచు సీహెచ్ అంజమ్మను కలిసి మంచినీటి ట్యాంకును శభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని కోరారు. పెంట్రాలలో కూడా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.మాధవరావు ఆరోగ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా సోమవారం తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని, పూర్తి వివరాల కోసం ఆత్మకూరు డిపో మేనేజర్ లేదా అసిస్టెంట్ మేనేజర్లను 9959225645, 7382924753, 8555929504 నెంబర్లుకు ఫోన్‌చేసి సంప్రదించాలని కోరారు.

పూర్వవిద్యార్థుల వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు

కందుకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తీక వనమహోత్సవం సందర్భంగా సోమవారం పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. 10వేల రూపాయల వ్యయంతో పాఠశాల ఆవరణ, ఆటస్థలాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ట్రీగార్డులు కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యా యులు ముప్పాళ్ల అంజయ్య, గుళ్లా వెంకటకృష్ణారావు, రావులకొల్లు వెంకటేశ్వరు, సీహెచ్ సుబ్బా రావు, గుళ్లా నరసింహం, ఇన్‌చార్జి హెచ్ ఎం విప్రనారాయణ, పాటిబండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తాళ్లూరు రమణయ్య మృతి



దగదర్తి (బిట్రగుంట) నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): మండల సీనియర్ నాయకులు తాళ్లూరు రమణయ్య నాయుడు (86) అనారోగ్యంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా, నెల్లూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ చైర్మన్ పనిచేశారు. విషయం తెలిసిన వివిధ పార్టీల నేతలు ఆయన కుమారుడు దగదర్తి ఎంపీపీ తాళ్లూ వెంకట క్రిష్ణప్రసాద్ నాయుడుతో ఫోన్లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు


నెట్‌బాల్ పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-19 బాలుర విభాగంలో విశాఖపట్నం, కడప, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. అండర్-19 బాలికల విభాగంలో నెల్లూరు, కడప, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల జట్లు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరు కున్నాయి. అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నం జట్లు విజయం సాధించాయి. మంగళవారం సెమీఫైనల్, ఫైనల్ ప్రారంభ మవుతాయని టోర్నీ ఆర్గనైజర్ తిరుపతయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు



భస్మాలంకారంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

ఆత్మకూరు, నవంబరు 11: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘనాథ స్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమశిలలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

● **శివాలయాల్లో ప్రత్యేక పూజలు**

ఉదయగిరి రూరల్: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా మండల పరిధిలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాలతో పాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయాల్లో భక్తులు విశేష పూజ లు నిర్వహించారు. దుత్తలూరు కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

రాష్ట్ర బడ్జెట్ సంక్షేమ పథకాల అమలుకు అనుకూలం

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాల అమలుకు సోమవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అనుకూ లంగా ఉందని కందుకూరు ఎమ్మె ల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్ర కటనలో పేర్కొన్నారు. 2.94 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో వెనుకబ డినవర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పంచాయతీ రాజ్‌శాఖకు 16,739కోట్ల రూపాయలు కేటా యించటం పభుత్వ ప్రాధాన్యత స్పష్టంగా కన్పి స్తుం దన్నారు. అలాగే రోడ్ల అభివృద్ధికి 9554 కోట్లు కేటాయించటం ద్వారా పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధినీ సమదృష్టితో ఈ ప్రభుత్వం చూ స్తున్నట్లు సామాన్యులకు సైతం అర్థమవుతోందన్నారు.

16న ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులు

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ ఆదేశాల మేరకు ఈ నెల 16న నిర్వహించనున్న శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ రజనీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యులు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలువురు నిరుపేద కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎం చెన్నమ్మ, పి లక్ష్మమ్మ, బి సంజీవులు, పాలెపి లక్ష్మి, ఎం అమ్మనమ్మ అనే నిరుపేదలకు 25 కేజీల బియ్యం, కేజి కంది పప్పు, నూనె, ఎర్రగడ్డలు, చింతపండు, తదితర నిత్యావసర సరుకులను ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన నాయకులు దాడి భాను కిరణ్, తిరుమలేష్, వంశీ కృష్ణ, వెంకటేష్, రాజా, హిమసాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలకండ్రికకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్యను మాజీ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. గంగపట్నం చంద్రశేఖరయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ధనుంజయ రెడ్డి చంద్రశేఖరయ్యను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు మానికల కృష్ణమూర్తి, ముత్యాల మోహన్, హరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఆయన పాల్గొని డిప్యూటీ తహసీల్దారు గిరీష్‌తో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించం అన్నారు. ఆయన వెంట కంచర్ల క్రిష్ణయ్య, వడ్డె వినయ్, సూరిబాబు, వేంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం తహసీల్దారు సోమ్లానాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తిరుమనతిప్ప కాలనీలో హెల్త్ క్లీనిక్ స్థలం ఆక్రమించి ఓ వైసీపీ నేత అమ్మకానికి పెట్టారని టీడీపీ నాయకుడు కాకు మధు వినతిపత్రం అందచేశారు. దీనిపై విచారణ చేసి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఆజాద్‌కు ఘన నివాళి

ఉదయగిరి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు షేక్ నాయబ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉదయగిరి నార్త్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పఠాన్ సందానిబేగం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆమెను ఆశాఖ కమిషనర్ షమీం మెడల్, మెమెంటో అందజేసి సన్మానించారు.

● ఏఎస్ పేట : గ్రామంలోని దర్గా సెంటర్‌లో సోమవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ నాయకులు హబీబ్‌బాషా, మల్లికార్జునరెడ్డి, అల్లాఉద్దీన్, మహమ్మద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు మండవ అభినందన

కావలి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్‌ను సోమవారం టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావును అమరావతిలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చి వారిని ప్రోత్సహించడం శుభపరిణామని సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

దేశ భద్రతపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ సెక్యూరిటీ విధులు, దేశ భద్రత విషయంలో తీర ప్రాంత విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రామాయపట్నం సీఐ శివనారాయణ తెలిపారు. సోమవారం రామయాపట్నం జడ్పీ హైస్కూల్‌లో తీరప్రాంత భద్రత అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సముద్రంమార్గంలో స్మగ్లర్లు, మానవ అక్రమ రవాణా, టెర్రరిస్టులు, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు రవాణ జరుగుతుంటా యన్నారు. వాటిని అరికట్టేందుకు గ్రామస్థులు, విద్యార్థులు తమవంతు సహకారం అందిచాలన్నారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్‌ఐ మస్తాన్ షరీఫ్, హెచ్ఎం జీవన్‌కుమార్, ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీను, సంపత్, వెంకట్, ప్రసన్న ఉన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు

కలిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొంది అమ్మకాలు జరిపే మద్యం దుకాణాదారులు ఎమ్మార్పీ ధరలకు మించి అధిక ధరలకు మద్యం అమ్మినా లేదా మద్యం కల్తీ చేసినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జలీల్‌బాష తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. నెలరోజుల వ్యవధిలో సర్కిల్ పరిధిలో ఎనిమిది మద్యం దుకాణాలపై దాడులు చేసి 8మందిపై కేసులు నమోదు చేసి 110మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమాలపై తొలివిడత మద్యం వ్యాపారులు పట్టుబడితే రూ.5లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే దుకాణం లైసెన్సు రద్దు చేస్తామన్నారు.

వేధింపుల కేసు నమోదు

బిట్రగుంట, నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ అరుంధతి వాడకు చెందిన బొడ్డు లలిత (30) భర్త వేధింపులు తటుకోలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బోజ్యా సోమవారం తెలిపారు. మృతురాలి అన్న యండవల్లి నరసింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదపవని చోరీ దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఈ చోరీలో 6గురు ముద్దాయిలను గుడ్లూరు సీఐ మంగారావుతో కలిసి సోమవారం ఉదయం 7.30 గంటలకు కొత్తపేట జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారి వద్ద నుండి 250 గ్రాముల వెండి, 20 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిని కందుకూరు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వీరికి రిమాండ్ విధించామన్నారు. వీరిలో ఇద్దరు నెల్లూరు టౌన్‌కు, ఒకరు బుచ్చి, ఒకరు పెదపవని, ఒకరు ఒరిస్సా మరొకరు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు ఉన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీటీఆర్ఐ ఫీడర్, కంచరగుంట ఫీడర్‌లలో 11కేవీ లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహ్మం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అబుల్ కలామ్ ఆజాద్‌కు ఘన నివాళి

వెంకటాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ డాక్టర్ ఎస్ విజయ భాస్కర్‌రావు విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, అధ్యాపకులు డాక్టర్ జే విజేత, డాక్టర్ మేరీసందీప్, డాక్టర్ గోపాల్, డాక్టర్ శ్యాం భగవాన్, డాక్టర్ హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో స్థానిక ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ముస్లిం మత పెద్ద మౌలానా ముస్తాక్ మదానీ, టీడీపీ నాయకులు టీ మస్తాన్‌బాబు, బీ మల్లికార్జున్‌నాయుడు, ముస్లిం నేతలు జమీర్, షేక్.ఖాదర్‌బాషా, ట్రీస్ సెక్రటరీ అహ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఏ శ్రీనివాసులు, జీ మల్లికార్జునయాదవ్,పెంచలనాయుడు, ప్రిన్సిపాల్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ ఆధ్వర్యంలో సోమవారం అవాజ్ కమిటీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, అవాజ్ కమిటీ సభ్యులు రియాజ్, షబ్బీర్, ఫయాజ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టర్‌కు సత్కారం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆజాద్ జయంతి సభలో మత పెద్దలతో కలసి ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్ హక్ కలెక్టర్ ఆనంద్‌ను శాలువాతో సత్కరించారు. అలాగే నగరంలోని పత్తేఖాన్‌పేట నగరపాలక సంస్థ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ తస్నీమ్ ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారాన్ని అందుకుని కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, నగర మేయర్ స్రవంతి, జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డాక్టర్ కలివెల ఎలీషాకుమార్, మైనార్టీ సంక్షేమశాఖాధికారి ఎం. శ్రీనివాసరావు, వక్ఫ్‌బోర్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర ముస్లిం ఫెడరేషన్ నాయకులు


వెంకటాచలం : ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

విద్యతోనే ఉజ్వల భవిత : ఆర్ఐవో


మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి 11 ఏళ్ల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.కొండయ్య, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు జి.కరుణకుమారి, బి.ప్రసన్న, అధ్యాపకులు వెంకట్రావు, చంద్రకళ, శ్రీదేవి, ప్రమీల, రమాదేవి, కృష్ణతులసి, రమణారెడ్డి, పెంచలనరసయ్య, విద్యార్థినిలు పాల్గొన్నారు.

● ఆర్ఐవో కార్యాలయంలో...

ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో, డీవీఈవో మధుబాబు, ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నగరపాలక ప్రాథమిక పాఠశాలలో...

నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో భారతరత్నం డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కిరణ్, విద్యా వలంటీర్ రాశి, విద్యార్థులు పాల్గొన్నారు.

● డాక్టర్ కిషోర్స్ రత్నంలో...

నగరంలోని సరస్వతీనగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో విద్యార్థులు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, స్వామి వివేకానంద, రతన్‌టాటా, నరేంద్రమోదీ తదితరుల వేషధారణలతో విద్యకు ఉన్న ప్రాముఖ్యతను తెలిపేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు క్విజ్, పోస్టర్ తయారీ, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● బాలభవన్‌లో...

నెల్లూరు(సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): బాలభవన్ ఆధ్వర్యంలో కొండాయపాలెం ప్రాథమిక పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ మహిళల ధర్నా



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రార్థనా స్థలాల ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని కోరుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నగరంలోని పరమేశ్వరినగర్ ప్రాంతంలోమద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని, అక్కడ ప్రార్థనా స్థలాలు, పాఠశాల, మహిళా హాస్టళ్లు, నివాసగృహాలు ఉన్నాయని చెప్పారు. ఆ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చయవద్దని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మొహ్మద్ జియాఉల్ హక్, హబీబా, నవీద్, జుబేర్, షకిల్, ఘని తదితరులు పాల్గొన్నారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నెల్లూరు(విద్య), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్రీయ విద్యాలయం పనిచేస్తుందని ప్రిన్సిపాల్ కె.శంకరయ్య తెలిపారు. నగర శివార్లలోని కొత్తూరులో ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో సోమవారం గ్రాండ్‌పేరెంట్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీఏ కోఆర్డినేటర్ అలివేలు మంగాబాయి, ప్రణీత, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దొరసానమ్మ, రవి, జోషిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హర హర శంకర.. శంభో శంకర !


మాగుంట లేఅవుట్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శైవాలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుదీరి హరిహర శంకర, జయజయ శంకర ఓం నమః శివాయ, శంభో శంకర అంటూ మహాశివుడ్ని శరణఘోషలు చేస్తూ స్వామివారికి పాలభిషేకాలు చేశారు. అనంతరం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భ్రమరాంబదేవికి, మూలస్థానేశ్వర స్వామికి విశేష పూలంగిసేవలు జరిగాయి. ధ్వజస్తంభంకు పుష్పాలంకర భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం కార్తీక దీపారాధనకు చేశారు. తోటలో శివయ్యకు అభిషేకాలు చేసి ఉసిరిక చెట్టుకు పూజలు చేశారు. కార్తీక వనభోజనాలు జరిగాయి.

● దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస 2వ సోమవారం భక్తులు పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపారాధనలు చేశారు. శంకరమఠం చంద్రశేఖరస్వామి, వాహబ్‌పేట, ఉమాశంకరస్వామి ఆలయం, నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, పప్పులవీధి పారు శివాలయం, ఉస్మాన్‌సాహెబ్ పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం, సుజాతమ్మ కాలనీలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు జరిగాయి.

ఘనంగా సిద్దలకోన తిరుణాళ్ల


ప్రత్యేక అలంకరణలో మేథా దక్షిణామూర్తి

సైదాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దేశ్వరకోన తిరుణాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాముల వారికి దేవరులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మేథా దక్షిణామూర్తి స్వామికి విశేష అలంకరణ, హోమం, పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ కాంతికుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వ నమోదు

నెల్లూరు(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని 47వ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుంది. సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు సతీమణి ధర్మవరం సుజాతరావు ఇంటింటికి వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్, కల్వకుంట సుధా, మునికృష్ణ, కంచి కృష్ణ, సుభాష్, షేక్ రబియా, సునీత, రమీజా తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ప్రజాపోరు ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 14న తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ ఉపాధ్యక్షుడు జానీబాషా, మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వారికి పట్టాలు ఎలా ఇస్తారు ?

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు11(ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి స్థలాలు లేక అల్లాడుతుంటే పందుల నిర్వాహకులకు ఇక్కడెలా పట్టాలు ఇస్తారంటూ రామచంద్రాపురం వాసులు ప్రశ్నించారు. సోమవారం వారు తహసీల్దారు కార్యాలయాన్ని చుట్టుముట్టారు. వాళ్లకు ఇంకెక్కడైనా స్థలాలు చూసి గ్రామంలో ఉన్న స్థలాలను తమకు కేటాయించాలని కోరారు. కమిషనర్ రామచంద్రాపురంలో పందుల నిర్వాహకులకు స్థలాలు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు సరికాదన్నారు. ఇంకా ఎవరికీ స్థలాలు కేటాయించలేదని తహసీల్దార్ చెప్పడంతో వారు శాంతించారు.

హెచ్ఐవీపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాలలో సోమవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సహకారంతో ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు లింకు వర్కర్లకు కూడా హెచ్ఐవీపై వైద్యులు అవగాహన కల్పించారు. బాధితులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు వివరాలు గోప్యంగా ఉంచి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

హేతువాద సంఘం కోశాధికారిగా రాజపాళెం రఘు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం రాష్ట్ర కోశాధికారిగా నెల్లూరుకు చెందిన డాక్టర్ రాచపాలెం రఘు నియమితులయ్యారు. విశ్రాంత కార్మికశాఖ అధికారి, రచయిత, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయనను ఆదివారం ఒంగోలులో జరిగిన హేతువాద సంఘం రాష్ట్ర మహాసభల్లో ఎంపిక చేశారు. కోశాధికారిగా ఎన్నికైన రఘుకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

రెండువేల సభ్యత్వాలు అభినందనీయం


వీపీఆర్ దంపతులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఇందుకూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడులో రెండు వేల టీడీపీ సభ్యత్వాలు పూర్తి చేయడం అభినందనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మైపాడులో టీడీపీ కార్యకర్తలు రెండువేల సభ్యత్వాలు పూర్తి చేయడంపై నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో సోమవారం కార్యకర్తలను వేమిరెడ్డి దంపతులు అభినందించారు. గ్రామంలో ఉన్న ఓటర్లలో 40 శాతం సభ్యత్వాలు పూర్తి చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటంరెడ్డి, సన్నపురెడ్డిలకు అభినందనలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నుడా చైర్మన్ పదవి పొందిన కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలను సోమవారం జనసేన పార్టీ నాయకులు వేర్వేరుగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, హరిరెడ్డి, మార్కెట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● కోటంరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

నెల్లూరు(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : నుడా చైర్మన్‌గా మూడవసారి ఎంపికైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిని కార్పొరేటర్లు, ముఖ్య నేతలు పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేనాటి శ్రీకాంత్ రెడ్డి, గణేష్ వెంకటేశ్వరరెడ్డిలు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా గజమాలతో సత్కరించారు. అంతకు ముందు బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● సురేష్‌రెడ్డికి సత్కారం

పొదలకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్టీసీ రీజినల్ చైర్మన్‌గా ఎంపికయిన బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని పొదలకూరు మండల బీజేపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఆయన భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బీ మారుతీకుమార్‌రెడ్డి, సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఆర్ ధనుంజయరావు, పీ ప్రశాంత్, ఏ నరేంద్ర, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



గజమాలతో కోటంరెడ్డిని సత్కరిస్తున్న నేతలు, సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న జనసేన నేతలు

సెప్టిక్ ట్యాంకర్లు లైసెన్సు పొందాలి

నెల్లూరు(సిటీ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సెప్టిక్ ట్యాంకర్లు కచ్చితంగా కార్పొరేషన్ వద్ద లైసెన్సు పొందాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో భూగర్భ డ్రైనేజీ కార్మికులకు సామగ్రి అందజేసి మాట్లాడారు. నెల్లూరులోని ప్రతి సెప్టిక్ ట్యాంకు కార్పొరేషన్ వద్ద విధిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. మురుగును సేకరించిన ట్యాంకర్లు హరనాథపురం వద్ద ట్రీట్మెంట్ ప్లాంట్లో వదలాలని చెప్పారు. ఇందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సెప్టిక్ ట్యాంక్ అవసరం ఉన్న ప్రజలు 14420 నెంబరుకు ఫోన్ చేసి బుక్ చేసుకోవాలని సూచించారు. అనంతరం నగరవాసుల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు.

నేడు శ్రీనివాసుడికి నగరోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింహపురి గోవిందమాల కనక దుర్గా సేవా సమితి, భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు శ్రీనివాసుడికి హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో నగరోత్సవం నిర్వహించనున్నారు. ఈ నగరోత్సవం పప్పులవీధి నుంచి దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం సాగుతుంది. భక్తులు అందరూ తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

కార్తీక దీపాలతో జొన్నవాడ ఆలయం కళకళ


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు11: మండలంలోని జొన్నవాడ ఆలయం సోమవారం కార్తీక దీపాలతో కళకళలాడింది. ఉపవాస దీక్షలతో ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో మల్లికార్జునస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,అమ్మవారికి శ్రీ చక్ర నవావరణ పూజలు జరిగాయి.

● విధులకు అర్చకుల డుమ్మా

ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం చేసేందుకు రావాల్సిన కొంతమంది అర్చకులు సమయానికి రాకుండా డుమ్మా కొట్టారు. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిబ్బంది వెళ్లి అర్చకులను బతిమాలి తీసుకురావడంతో పూజలు యథావిధిగా జరిగాయి.

● వైభవంగా కల్యాణోత్సవం

కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి పురోహితులు శ్రీధర్‌శాస్త్రి సోమవారం వైభవంగా నిత్య కల్యాణం నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు, పలువురు నూతన వధూవరులు, కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా భవానీ శంకరుడి ఆలయ వార్షికోత్సవం


పూలంగి సేవలో భవానీ శంకరస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ నగర్ శ్రీకృష్ణమందిరంలో వెలసి వున్న భవానీ శంకర్ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు బి.శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో మహారుద్రాభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయహోమం, విశేష మూలమంత్రా హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవ, శివనామ భజనలు, పుష్పాభిషేకం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణీ మల్లేశ్వరి దంపతులు వ్యవహరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని టైలర్స్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్ కన్పించడం లేదని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై వేదాయపాలెం పోలీసులు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్ చిన్న కుమార్తె ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన మనస్తాపానికి గురై కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లోనే పడుకున్న అతను సోమవారం ఉదయం నుంచి కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రైల్ రన్ విజయవంతం

నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఘాట్‌లో ఈనెల 15న కార్తీక లక్ష దీపోత్సవంలో ప్రదర్శించే 108 తెప్పల శివాకృతి ట్రైల్ రన్ సోమవారం విజయవంతమైంది. ఈ దీపోత్సవాని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన స్వర్ణా చెరువులో ట్రైల్‌రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీక లక్ష దీపోత్సవంకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారని, వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● మనుబోలు ఎస్ఐ శివరాకేష్



మనుబోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోర్టు రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్ రోడ్డు వరకు 16 కిలోమీటర్ల జాతీయరహదారి ఉంది. ఈ హైవేలో ప్రమాదాలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తున్నాం.

? హైవేపై బ్లాక్‌స్పాట్ల వద్ద ఏమి చర్యలు తీసుకున్నారు

! హైవే పరిధిలో రెండు బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశాం.

? జాతీయరహదారిపై సీసీ కెమెరాల పరిస్థితి ఏంటి

! గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల లేవు. దాతలు ముందుకొస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగలం.

? సిబ్బంది కొరత ఏమైనా ఉందా, ఫిర్యాదుల విచారణలో నిర్లక్ష్యం ఎందుకు..

! పీఎస్‌లో సిబ్బంది కొరత లేదు. అయితే సమర్థత లేదు. వారిలో పనిసామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఫిర్యాదుపై స్పందించి విచారణ చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

వీఎస్‌యూలో జాబ్ మేళా

వెంకటాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభ్యర్థులకు పది ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 100మందికిపైగా హాజరుకాగా, 48 మందికి ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ జే విజేత, ఎంప్లాయిమెంట్ అధికారి జే శ్రీహరి, సీడాప్ ఏరియా కోఆర్డినేటర్ పీ కిరణ్మయి, ప్లేస్‌మెంట్ అధికారి ఓ. జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

ఇందుకూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలో పలు పీహెచ్‌సీలను సోమవారం జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదరవలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, వైద్యసిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఇందుకూరుపేట ప్రభుత్వ స్కూలును సందర్శించి, పిల్లలకు ఐరన్ టాబ్లెట్స్ మింగిస్తున్నారా ? లేదా... హెల్త్ చెకప్ చేస్తున్నారా... అని ఆరా తీశారు. 104 ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా కొత్తూరులో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, అందిస్తున్న సేవలు గురించి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో జగదేవిపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ జయపాల్‌రెడ్డి, డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు, సీహెచ్‌వో నీలిమ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-1వ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు ఈనెల 12న(నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే కార్యక్రమంపై ఆసక్తి ఉన్న వారు 9959225641కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

నేడు బీసీల ధర్నా

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌పీ, బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీబొమ్మ సెంటర్‌లో భారీ ధర్నా చేపట్టనున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్, నెల్లూరు జిల్లా పూర్వపు ఎస్పీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై మీనమేషాలు లెక్కిస్తుందని, దీనిపై తమ పార్టీ తాడోపేడో తేల్చుకునేందుకు జిల్లాల వారీగా మహా ధర్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ధర్నాకు బీసీ వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షేత్రస్థాయి శిక్షణకు వచ్చిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఐఆర్ఎస్ తదితర సివిల్ సర్వీసెస్ అధికారులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. అంతేకాకుండా తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో పాల్గొని ఆ వేదిక తీరుతెన్నులను పరిశీలించారు.

చంటి బిడ్డల కోసం..



వణికించే చలి. దోమల బెడద. అయినా, ఆరు బయట బాలింతలు ఇలా పడిగాపులు కాసేది లోపల చికిత్స పొందుతున్న పురిటిబిడ్డల కోసం. పుట్టిన శిశువులకు ఆరోగ్య పరిస్థితి బాగలేకుంటే రుయా చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చి ప్రత్యేక ఐసీయూ, ఎన్ఐసీయూ వార్డుల్లో ఉంచి వైద్యం అందిస్తారు. వారికి పాలు పట్టించేందుకు తల్లులు అందుబాటులోనే ఉండాలి. అందుకని ఆస్పత్రి ఆవరణలోనే వార్డుల పక్కనే వైద్యాధికారులు తల్లులు ఉండేందుకు ప్రత్యేక పడకలను ఏర్పాటు చేశారు. అసలే బాలింతలు. దీనికితోడు ఇన్‌ఫెక్షన్స్ వచ్చే ప్రదేశం. అవేవీ పట్టించుకోకుండా ఆ తల్లులు తమ బిడ్డలు ఆరోగ్యంగా ఏ క్షణాన తమ ఒడికి చేరతారా అని ఆశతో ఎదురు చూస్తూ నిరీక్షిస్తున్నారు. బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక గదులు, సదుపాయాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

పూట గడిచేదే కష్టంగా ఉంది



ఉన్న ఒకటిన్నర ఎకరా నగరి కాల్వకు (గాలేరు- నగరి) ప్రభుత్వం తీసుకుంది. గవర్నమెంటు నుంచి వచ్చిన కొద్దిపాటి నష్టపరిహారం బ్యాంకు అప్పునకు తీసేసుకున్నారు. కొడుకేమో కూలి పనుల కోసం బెంగళూరు వెళ్లిపోయాడు. భార్య అనారోగ్యంతో చనిపోయింది. 70 ఏళ్ల వయసులో నడవలేకపోతున్నా. రోజూ పూట గడిచేదే కష్టంగా ఉంది. కాస్త పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి' అని అధికారులను వేడుకుంటున్నారు దూర్వాసులు నాయుడు. వడమాలపేట మండలం సీతారామపురానికి చెందిన ఈయన ఏడాదిగా అటు తహసీల్దారు.. ఇటు కలెక్టర్ ఆఫీసులకు తిరుగుతున్నారు. కానీ, పింఛను రాలేదు. ఇలా ఎందరో బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ గోడు వెళ్లగక్కారు.

6

రాష్ట్ర బడ్జెట్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు గణనీయంగా నిధుల కేటాయింపులు జరిగాయి. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా తదితర సాగునీటి ప్రాజెక్టులకు రూ. 4530 కోట్లు దక్కాయి. దీంతో ఐదేళ్ళ తర్వాత సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక రానుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు వివిధ కార్యక్రమాల కింద రూ. 350 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రెండు జిల్లాల పరిధిలోని యూనివర్శిటీలు, శ్రీసిటీ ఐఐటీ సంస్థలకు రూ. 500 కోట్లు ఇచ్చింది. పులికాట్ పరిధిలో మత్స్యకారులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పూడికతీత పనులకు రూ. 97 కోట్లు మంజూరు చేసింది. చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సైతం ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో రూ. 210 కోట్లు కేటాయించింది. గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు జిల్లాల పరిధిలో సాగునీటి, పారిశ్రామిక, విద్యా రంగాలకు నిధులేమీ కేటాయించని నేపథ్యంలో తాజాగా కూటమి ప్రభుత్వం జరిపిన నిధుల కేటాయింపులు రెండు జిల్లాల ప్రజలకు ఊరటనిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నిధులు ఘనం



చిత్తూరు,తిరుపతి జిల్లాలకు బడ్జెట్‌లో గణనీయంగా నిధుల కేటాయింపు

సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో ఇక కదలిక

తెలుగు గంగ ప్రాజెక్టు పనులకు రూ. 879.24 కోట్లు

ఎన్టీయార్ తెలుగు గంగ ప్రాజెక్టుకు మొత్తంగా ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనులకు గత వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 231.84 కోట్లు కేటాయించగా 2023-24లో రూ. 798.11 కోట్లు ప్రతిపాదించింది. అయితే బడ్జెట్ సవరణల్లో ఆ మొత్తాన్ని రూ. 619 కోట్లకు కుదించింది. ప్రస్తుత ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించినప్పటికీ అందులో సింహభాగం నెల్లూరు జిల్లా పరిధిలో ఖర్చు చేయనున్నారు. తిరుపతి జిల్లా విషయానికొస్తే అందులో సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులకు రూ. 66 కోట్లు రానున్నాయి. ఈ కెనాల్ పనులకు గత ప్రభుత్వం 2022-23లో రూ. 10.17 కోట్లు కేటాయించింది. అలాగే 2023-24లో రూ.41.92 కోట్లు కేటాయించినప్పటికీ తర్వాత దాన్ని బడ్జెట్ సవరణల్లో రూ. 4.19 కోట్లకు కుదించింది. దీంతో ఈ కెనాల్ పనులేమీ జరగలేదు. తాజా కేటాయింపులతో పనులు తిరిగి మొదలు కానున్నాయి. అలాగే తాజా బడ్జెట్‌లో తెలుగు గంగకు కేటాయించిన నిధుల నుంచీ కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ. 11 కోట్లు దక్కనున్నాయి. ఈ స్కీమ్‌కు గతేడాది కూడా బడ్జెట్‌లో రూ. 11.54 కోట్లు కేటాయించారు.



గాలేరు నగరికి రూ. 2438.94 కోట్లు

దశాబ్దాలుగా జిల్లా ప్రజలను ఊరిస్తున్న గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ. 2438.94 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు జరగని సంగతి తెలిసిందే. 2022-23లో నామమాత్రంగా రూ.275.48 కోట్లు కేటాయించినప్పటికీ పనులేమీ జరగలేదు. ఇక 2023-24లో రూ.855.34 కోట్లు తొలుత కేటాయించిన ప్రభుత్వం తర్వాత బడ్జెట్ సవరింపుల్లో దాన్ని రూ. 2072.86 కోట్లకు పెంచింది. నిధుల కేటాయింపును పెంచినా పనులు మాత్రం మొదలు కాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో పనులు వేగంగా జరగగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటివరకూ అమల్లో వున్న టెండర్లను రద్దు చేయడంతో పాటు ఏకంగా ప్రాజెక్టు డిజైన్‌ను కూడా మార్చివేసింది. శేషాచల అడవుల్లో టన్నెల్ నిర్మాణానికి బదులు గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని తంబళ్ళపల్లి, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల మీదుగా తూర్పు ప్రాంతానికి తరలించేలా ప్రణాళికను మార్చింది.కానీ దానికి నిధులేవీ కేటాయించలేదు. ఇపుడు కూటమి ప్రభుత్వం తొలి ఏడాది బడ్జెట్‌లోనే ఏకంగా రూ. 2438 కోట్లు కేటాయించడంతో మునుపటి డిజైన్ ప్రకారమే పనులు సజావుగా సాగుతాయని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.



హంద్రీ-నీవాకు రూ. 2014.23 కోట్లు

చిత్తూరు జిల్లాకు ప్రాణాధారంగా మారనున్న హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్ళూ విస్మరించగా కొత్త ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే గణనీయంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 979.73 కోట్లు కేటాయించినా పనులేవీ చేపట్టలేదు. 2023-24లో తొలుత రూ.270.14 కోట్లు కేటాయించిన అప్పటి ప్రభుత్వం తర్వాత దాన్ని రూ. 486.37 కోట్లకు పెంచింది. అయినప్పటికీ ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప ఈ ఐదేళ్ళలో కాలువ తవ్వకాలు గానీ, రిజర్వాయర్ల పనులు గానీ జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో తంబళ్ళపల్లి, మదనపల్లె, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలకు హంద్రీ-నీవా జలాలందించిన చంద్రబాబు తాజా బడ్జెట్ కేటాయింపులతో ఈ పర్యాయం పీలేరు, పలమనేరు నియోజకవర్గాలకు నీరందించే అవకాశం కనిపిస్తోంది.





తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 350 కోట్లు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద వివిధ అభివృద్ధి పనులకు రూ. 20 కోట్లు రానుండగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద వాడిన నీటిని తిరిగి వినియోగించేలా మార్చేందుకు రూ. వంద కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 16.17 కోట్లు, ఇతర ఖర్చులకు 6.50 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు రూ. 75.94 కోట్లు, సామర్థ్యాల పెంపునకు రూ. 27.29 కోట్లు, సిబ్బంది వేతనాలకు రూ. 78.80 కోట్లు చొప్పున ఇతర నిధులు దక్కాయి. అలాగే నగరంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడానికి రూ. 25.58 కోట్లు కేటాయించారు.

పులికాట్‌కు పునఃవైభవం

● పూడికతీతకు 97కోట్లు కేటాయింపు

తడ/వాకాడు, ఆంధ్రజ్యోతి: పులికాట్ మత్స్యకారుల చిరకాల కోరిక నేరవేరనుంది. బడ్జెట్‌లో పులికాట్ పూడిక తీతకు రూ.97 కోట్లు కేటాయించడంతో మత్స్యకారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పులికాట్ సరస్సు ముఖద్వారాలు మూడు దశాబ్దాలకు ముందే పూడుకుపోయాయి. అప్పట్నుంచి మత్స్యకారుల జీవనం గగనంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా పూడికతీతను పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాటు పట్టించుకోకుండా.. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో అంటే గతేడాది నవంబరులో పూడికతీత పనులకు శంకుస్థాపన చేస్తున్నామంటూ హడావుడి చేసింది. అప్పటి సీఎం జగన్ తడ మండలం మాంబట్టులో శంకుస్థాపనకు సిద్ధం కాగా వరుణుడు అడ్డురావడంతో వాయిదాపడింది. ఆ తరువాత దీనిని పక్కన పెట్టేసింది. ఎన్నికల సమయంలో పూడికతీతపై టీడీపీ హామీనిచ్చింది. ఆమేరకు కేంద్ర ప్రభుత్వంతో కలసి సంయుక్తంగా రూ.97 కోట్లతో వాకాడు మండలం పూడిరాయదొరువు వద్ద పూడికతీతకు సిద్ధమైంది. ఆమేరకు బడ్జెట్‌లో ఆ ప్రతిపాదనలు పెట్టడంపై సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాలలోని ద్వారా సుమారు 20వేల మంది మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయన్నారు.



పూడిరాయదొరువు వద్ద ప్రారంభం కానున్న సముద్ర ముఖద్వారాల అభివృద్ధి పనులు

ఉన్నత విద్యా సంస్థలకు రూ. 500 కోట్లు



జిల్లాలో ఉన్నత విద్యా సంస్థలకు కొత్త ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించింది. ఎస్వీయూకు తాజా బడ్జెట్‌లో రూ. 226.38 కోట్లు కేటాయించగా ఈ వర్శిటీకి 2022-23లో 263 కోట్లు, 2023-24లో రూ. 211.83 కోట్లు చొప్పున వచ్చాయి. ఎస్వీ వెటర్నరీ వర్శిటీకి గతేడాది రూ. 127.85 కోట్లు దక్కగా ఈ పర్యాయం రూ. 153 కోట్లు కేటాయించారు. ఇక పద్మావతీ మహిళా వర్శిటీకి రూ. 72.73 కోట్లు ఈ బడ్జెట్‌లో దక్కగా ఇదే వర్శిటీకి 2022-23లో 52.22 కోట్లు, 2023-24లో రూ. 51.74 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి. కుప్పంలోని ద్రవిడ యూనివర్శిటీకి తాజా బడ్జెట్‌లో రూ. 27.91 కోట్లు కేటాయించారు. ఈ వర్శిటీకి 2022-23లో రూ. 18.48 కోట్లు, 2023-24లో రూ. 23.17 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి.శ్రీసిటీలో కొత్తగా ఏర్పాటవుతున్న ఐఐటీకి కూటమి ప్రభుత్వం రూ. 19.52 కోట్లు కేటాయించింది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన దశలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులు తిరుపతి, చిత్తూరు జిల్లాల అభివృద్ధికి మేలు చేస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

అదంతా కట్టుకథే

● తల్లితండ్రులకు భయపడి బాలికే 'దాడి' నాటకమాడింది
● ఎర్రావారిపాళెం మండల ఘటనపై ఎస్పీ సుబ్బరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఎర్రావారిపాళెం మండలంలోని బాలికపై అత్యాచారం జరగలేదు. దాడి కూడా తల్లిదండ్రులకు భయపడి ఆ బాలిక అల్లిన కట్టు కథే' అని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టంచేశారు. తిరుపతిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి బాలుడ్ని జువైనల్ హోంకు తరలించామన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపినట్లు చెప్పారు. 'బాలుడు, బాలికది ఒకే ఊరు. ఒకే స్కూలులో ఒకే తరగతి చదువుతున్నారు. ఈ నెల 4న సాయంత్రం వారిద్దరూ కలసి ముందుగానే అనుకున్న ప్రకారం మాట్లాడుకోవడానికి వెళ్లడంతో ఇంటికి వెళ్లడం ఆలస్యమైంది. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు రెండు సార్లు ఆమెకోసం వెదికి స్కూలు వద్దకు వచ్చారు. వారికి భయపడి ఆ బాలిక చేతిలో ఉన్న గాజులతో గీసుకుని గాయాలు చేసుకుంది తప్ప అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షలు, పోలీసులు దర్యాప్తులో తేలింది. బాలికకు సంబంధించి రక్త పరీక్షలు, ఇతర అన్ని రకాల పరీక్షలు జరిపి డాక్టర్ల నుంచి రిపోర్టు తెప్పించుకున్న తర్వాత బాలికపై అత్యాచారం జరగలేదని నిర్ధారణకు వచ్చాం. కానీ బాలిక చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి పథకం ప్రకారం తనపై గుర్తు తెలియని వ్యక్తులు ముసుగు వేసుకుని ఒక మోటారు సైకిల్‌పై వచ్చి దాడి చేశారని తల్లి దండ్రులతో చెప్పింది' అని ఎస్పీ వివరించారు. సంఘటన జరిగిన రోజున ఎర్రావారిపాలెం ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, భాకరాపేట సీఐ అక్కడకు చేరుకుని మెరుగైన చికిత్స నిమిత్తం బాలికను తిరుపతి ప్రసూతి ఆస్పత్రికి తరలించారని గుర్తుచేశారు. అప్పటికప్పుడే అవసరమైన పరీక్షలు చేశారన్నారు. మహిళా డీఎస్పీ, తహసిల్దార్, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, బాలిక తల్లి తండ్రుల సమక్షంలో బాలికను విచారించి, వాగ్మూలం నమోదు చేశామన్నారు. తనతో పాటు చదువుతున్న ఆ బాలుడ్ని కాపాడాలనే ఉద్దేశంతో ఆ బాలిక కట్టుకథ అల్లినట్లు విచారణలో తేలిందన్నారు. బాలిక ఇచ్చిన స్టేట్‌మెంటు ప్రకారం ఆ బాలుడ్ని అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించామని ఎస్పీ చెప్పారు. ఇటువంటి ఘటనలపై వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అత్యాచారం అంటూ కల్పిత వార్తలు ప్రచురించినా, ప్రచారం చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎర్రావారిపాళెం బాలిక ఘటనపై దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

చట్టపరిధిలోనే పనిచేస్తున్నా

నేను రాజకీయాల గురించి మాట్లాడను. ఎవరెన్ని ఆరోపించినా చట్టపరిధిలోనే పనిచేస్తున్నా. నేనూ ఏపీకి చెందిన అధికారినే. మాది అనంతపురం జిల్లా. స్వామి వారి సన్నిధిలో పనిచేసే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. తిరుపతిలో పనిచేయాలని నాకు చాలా కోరిక ఉండేది. జిల్లా ఎస్పీగా పోస్టింగ్ తీసుకుని వచ్చి అంకితభావం, అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో పనిచేస్తున్నా. నాకు తప్పు చేయాల్సిన అవసరం లేదు. ఎప్పుడూ చట్టపరిధిలోనే పనిచేస్తా.

- సుబ్బరాయుడు, తిరుపతి ఎస్పీ

ఇసుక లారీ సీజ్

చంద్రగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు సీజ్ చేశారు. టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. తిరుపతి నుంచి చిత్తూరువైపు ఇసుకపై పట్ట కట్టుకుని కర్ణాటకకు వెళుతున్న లారీని ఆపారు. పట్టను తొలగించి చూడగా ఇసుక ఉంది. అప్పటికే లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. లారీని సీజ్ చేసి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



సముద్రపు కాకుల సందడి













తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని కొండూరుపాళెం ప్రాంతంలో సీగల్స్, పెయింటెడ్ స్టార్క్స్ సందడి చేస్తున్నాయి. చలికాలం మొదలవగానే విదేశాల నుంచి ఈ విహంగాలు వచ్చి దిగాయి. చిన్న చేపలూ, రొయ్యలూ, ఎంట్రకాయలూ వేటాడే ఈ పక్షులను సముద్రపు కాకి, కాస్పియన్ టెర్న్ అని కూడా అంటారు. పరిణామంలో చిన్నదైనా చాలా ఎత్తుకి ఎగురుతూ వేగంగా కిందకి దూసుకు వస్తుంది. ఇవి గుంపులు గానే కనిపిస్తుంటాయి. సమూహాలుగా దేశాలు దాటి ప్రయాణిస్తాయి. పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగ) వెదురు పట్టులో చింత చెట్లమీద ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటుంది. సముద్రపు కాకులు నేలపట్టులో కనిపించవు. పులికాట్‌లో అక్కడక్కడా తారసపడుతాయి.



కాకినాడ్ హోప్ ఐలెండ్స్‌లోనూ ఇవి ఇదే కాలంలో కనిపిస్తాయి. అయితే వీటి సంఖ్య అక్కడ 200 కి మించి ఉండదని అంటారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం ఉప్పుటేరులో మాత్రం వందలాదిగా సముద్రకాకులు సందడి చేస్తున్నాయి.

-వాకాడు,ఆంధ్రజ్యోతి

శైవక్షేత్రాల్లో దీపకాంతులు

కార్తీక మాసం రెండో శుక్రవారం. సాయం సంధ్యవేళ శైవక్షేత్రాల్లో భక్తులు నేతి దీపాలు వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతిలోని కపిలతీర్థంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.







వెలుగులీనుతున్న శ్రీకాళహస్తిలోని వైష్ణవ కోనేరు



కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సమస్య మొదటికే..!

● మళ్లీ సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు



కేవీబీపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు మాట తప్పారంటూ కళత్తూరు దళిత రైతులు మళ్లీ సెల్ టవరెక్కారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కిందకు దిగమంటూ సోమవారం సాయంత్రం భీష్మించారు. కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెం.4లోని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఆ భూములు తమవంటూ అటవీశాఖ అడ్డంకులు కల్పిస్తోందంటూ శనివారం ఉదయం ఈ రైతులు సెల్ టవర్ ఎక్కిన విషయం తెలిసిందే. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి తదితరులు సమస్యను వంద రోజుల్లో పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో దిగొచ్చారు. కాగా, ఆదివారం భూముల వద్ద వెళ్తున్న తమను అటవీశాఖ అధికారులు అడ్డగించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తిరిగి భూముల వద్దకు వెళ్లితే ఎఫ్ఆర్వో మాధవిరెడ్డి అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడారన్నారు. వీరి తీరుకు నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పురుగులమందు డబ్బాలతో టవర్‌పైకి ఎక్కారు. సమస్య పరిష్కారమయ్యే దిగేది లేదన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పినా రైతులు పట్టించుకోలేదు. సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కళత్తూరు దళిత రైతులతో చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటలకు వీరు రైతులతో చర్చించారు. రైతులు మాత్రం ససేమిరా అన్నారు. ఇంతలో నలుగురు మహిళలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకుండా కాపాడారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు టవర్ దిగేది లేదని రైతులు తెగేసి చెప్పారు. దీంతో వచ్చిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బడ్జెట్‌పై నేతల మాట

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ కూటమికే చెల్లింది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ఆశాజనకంగా లేదు

బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగ భృతి, ఎస్సీలకు మేలు చేసేలా ఆశించినంత లేదు. హడ్కో రుణాలను చక్రవడ్డీలతో తీసుకురావడం ఏమిటో అర్థం కావడంలేదు. అప్పులు తీసుకురావడంలో గత ప్రభుత్వంతో పోటీ పడుతున్నట్లుంది.

- డాక్టర్ చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత

వెనుకబడిన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రూ3097కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. టీడీపీ తొలినుంచీ వెనుకబడిన వర్గాలకు బడ్జెట్లో అగ్రస్థానం కల్పిస్తోంది. ఇప్పుడూ బీసీలకు వెన్నుదన్నుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టడం హర్షదాయకం.

- నరసింహ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్

ఏపీ భవిష్యత్తు మారబోతోంది

బడ్జెట్‌లో ప్రజా శ్రేయస్సు, సర్వతోముఖాభివృద్ధితో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కనిపిస్తోంది. మహిళలు, నిరుద్యోగులు చిన్న చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను మంజూరుకు పెద్దపీట వేయడం హర్షణీయం. గత ఐదేళ్లుగా అధోగతిలోకి వెళ్లిపోయిన ఏపీ భవిష్యత్తు కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో మారబోతోంది.

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ సభ్యుడు

వేతన జీవులగురించి పట్టించుకోలేదు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు,వారి ఉద్యోగ భద్రత గురించి ప్రస్తావన లేదు. ఇది బాధాకరం.

- కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల హామీలపై ప్రకటన ఏది?

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయాన్ని బడ్జెట్‌లో పొందుపరచలేదు. దీంతో ప్రజల్లో హామీల విషయమై స్పష్టత లేకుండా పోయింది.

- వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పాజెక్టులకు మొండి చేయి

రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రస్తావించలేదు. రైతు సంక్షేమంపై స్పష్టత ఇవ్వలేదు. ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీపై ప్రకటన లేదు.

- ఎ.రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

యువతకు పెద్దపీట

ఉన్నత విద్యకు రూ.2,326 కోట్ల కేటాయించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ.1,215 కోట్లు వెచ్చించనున్నారు. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు రూ.322 కోట్లు కేటాయించడంతో పాటు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం బాగుంది. యువతకు పెద్దపీట వేసినట్టు కనిపిస్తోంది.

- డాక్టర్ కొండేటి సునీత, ఎకనమెట్రిక్స్ డిపార్ట్‌మెంట్, ఎస్వీయూ

అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం

పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు రూ.3,127 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. పంచాయతీ ప్రధాన రంగాలకు ఆశాజనకమైన కేటాయింపులు జరిగాయి. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

- మోహన్‌కుమార్‌రాజు, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేర ప్రవృత్తికి దూరంగా ఉండండి

● యువతకు ఎస్పీ హితబోధ

● పద్మావతి వర్సిటీలో అవగాహనా కార్యక్రమానికి విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు ఎస్పీ సుబ్బరాయుడు హితబోధ చేశారు. సైబర్, డ్రగ్స్ నేరాలు, చిన్నారులు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమలోని ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలను దేశ.. వ్యక్తిగత భవిష్యత్తు కోసం ఉపయోగించాలని కోరారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన శిక్షలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 100, 112 కు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ క్రైం బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల తెలియక అనేక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సైబర్ క్రైం బాధితుల్లో డిగ్రీ లోపు యువత ఎక్కువగా ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిన్నారులపై అత్యాచార ఘటనల్లో ఎక్కువగా పక్కింటి వారు, తెలిసిన వారే బాధ్యులుగా ఉంటున్నారన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి సరఫరాకు కాలేజీలను అడ్డాగా మార్చుకొని అక్రమ దందా సాగిస్తున్నారన్నారు. మత్తు పదార్థాల నివారణకు విద్యార్థులు, అధ్యాపకుల సహకారం ప్రభుత్వానికి అవసరమన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పద్మావతి వర్సిటీ వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా విద్యార్థులు తమ పరసరాల్లోని వారికి అవగాహన కల్పించాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు


అర్జీలకు పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులకు త్వరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతో పాటు జేసీ శుభం బన్సల్, రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 184 అర్జీలు అందగా అందులో 120 భూ సమస్యలపైనే ఉన్నాయి.


సాగుభూమిని కబ్జా చేశారు



30 ఏళ్లగా బీడు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 3 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటి బిడ్డల్లా జా గ్రత్తగా చూశాం. రాత్రికి రాత్రే గ్రామానికి చెందిన పవన్, మరికొంత మంది మామిడి మొక్కలు నరికేయడమేగాక ఆ భూమిలో రేకుల షెడ్డు వేశారు. అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మీరైనా న్యాయం చేయండి.

- రామకృష్ణ, బంగారెడ్డికండ్రిగ, వడమాలపేట మండలం

స్థలం కబ్జాకు ప్రయత్నం



నాకు సరిగా మాటలు రావు. పైగా వికలాంగురాలిని.తండ్రి నాగయ్య వద్ద ఉంటున్నా. నా కోసం 26ఏళ్ల క్రితం ఇంటి పక్కనే కొంత స్థలాన్ని మా తండ్రి కొనిచ్చాడు.ఆ స్థలం తమదంటూ కొంతమంది గతంలో ఇబ్బందిపెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం ఊరుకున్నారు. మళ్లీ వచ్చి స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు, కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయండి.

- జెస్సీ, వేంబాకం హరిజనవాడ, నాగలాపురం

జీవనోపాధి కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం



గతంలో విజయవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేశా. రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగి మంచానపడ్డాను. నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నా. ముగ్గురు కలెక్టర్లు మారినా ఏ ఒక్కరూ ఉపాధి కల్పించలేదు. ఇలాగైతే ఆత్మహత్యే శరణ్యం.

- మురళి, ముత్యాలమ్మ గుడివీధి, శ్రీకాళహస్తి



పెరిగిన ఓపీ కేంద్రాల్లో ఓపీ తీసుకుంటున్న రోగులు

రుయాలో అదనపు ఓపీ కేంద్రాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సులువుగా ఓపీ తీసుకునేందుకు సూపరింటెండెంట్ రవిప్రభ సోమవారం మూడు అదనపు ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో కేవలం నాలుగు ఓపీ కేంద్రాలే ఉన్నాయి. దీనికితోడు ఈ-ఆస్పత్రి పేరుతో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడంతో ఓపీ తీసుకోవడం రోగులకు కష్టంగా మారింది. దీనిపై 'రుయాలో 'ఓపీ'కకు పరీక్ష' శీర్షికన ఈనెల 7న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు సోమవారం నుంచి అదనంగా మరో మూడు ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో 11 గంటలకే ఓపీ కేంద్రంలో అందరికీ ఓపీ అందించేందుకు వీలైంది.

టీడీఆర్ బాండ్లపై విజి'లెన్స్'

● విచారణ వేగవంతం చేసిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంలో విచారణ వేగవంతమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా విజిలెన్సు విభాగం ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వీరిలో విజిలెన్సు డీఈ నాగసురేష్, సీఐ చంద్రశేకర్ నాయక్, ఏఈలు సౌజన్య, రామ్మోహన్ తదితర సిబ్బంది ఉన్నారు. అభివృద్ధి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రోడ్ల ముసుగులో టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరుపతితో పాటు రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీల్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణాలపై విచారణకు ఆదేశించింది. ఈక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అధికారుల నుంచి టీడీఆర్ బాండ్లకు సంబంధించిన అన్ని రికార్డులను విజిలెన్సు అధికారులు తెప్పించుకున్నారు. సోమవారం నుంచి విచారణ ప్రారంభించారు. ఆ వివరాల ప్రకారం ఒక్కో రోడ్డును పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల అవసరం ఎంత వరకు ఉందనే కోణంలో విచారిస్తున్నారు. ప్రతి రోడ్డును క్షుణంగా పరిశీలించి భూములు ఇచ్చిన వారు, బెదిరించి భూములు లాక్కున్న వారుంటే వారినుంచీ రాత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకోనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రణాళికాబద్ధంగా వేశారా లేదా అనేదీ పరిశీలించనున్నారు. రోడ్లు వేసిన ప్రాంతంలో అప్పట్లో భూమి విలువ ఎంత అనే దానిపైనా విజిలెన్సు అధికారులు దృష్టి సారించారు. ప్రతి వ్యక్తిని కలిసి విచారించి స్టేట్‌మెంట్లు నమోదు చేస్తామని డీఈ నాగసురేష్ చెప్పారు.

ఉపాధ్యాయులకు 'ఉత్తమ' అవార్డులు

● సీఎం చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి(విద్య), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 'ఉత్తమ' ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న వారిలో అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఎనిమిది మంది (ఒక ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు ఉపాధ్యాయులు) ఉన్నారు. ఏర్పేడు మండలం పల్లం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. శ్రీకాళహస్తి మండలం జడ్పీ హైస్కూల్ సోషియల్ స్టడీస్ టీచర్ సురేష్ కునాటి, తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం మండల ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ కె.బాలసుబ్రహ్మణ్యం, చంద్రగిరి మండలం రంగంపేట జడ్పీ హైస్కూల్ పీఈటీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, ఏర్పేడు మండలం బండారుపల్లె జడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం రాజానగరం జడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు వి.కామాక్షయ్య, దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పీజీటీ బి.యామిని, కేవీబీ పురం కేజీబీవీ ఇంగ్లిష్ టీచర్ ఆర్.మంజువాణి అవార్డులు అందుకున్నారు.

మోహన్‌నాయుడికి ఉత్తమ అధ్యాపక అవార్డు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ గుట్టపల్లి మోహన్‌నాయుడికి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.



చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్‌నాయుడు

'అగ్రి'లో క్రీడాపోటీలు ప్రారంభం



తిరుపతిరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు సోమవారం క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. వర్సిటీపరిధిలో 18కళాశాలలకు చెందిన 410మంది విద్యార్థులు ఈపోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులకు నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు.



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ మేరీస్, బాలాజీ, స్వర్ణాంధ్రభారతి, ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొందరు సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మన వివరాలను కానీ, బ్యాంకు ఖాతా నంబర్లు తెలియనివారికి ఇవ్వకూడదన్నారు. ర్యాగింగ్, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నాయుడుపేట టౌన్/కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాలపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు విద్యార్థులకు జూమ్ సమావేశం ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్పీ జూమ్ సమావేశం నిర్వహించారు. అలాగే అన్ని పాఠశాలల్లో డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ● కోట మండల పరిధిలోని విద్యానగర్, కోటలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆజాద్ సంస్కరణలతోనే పటిష్ఠ విద్యావ్యవస్థ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ సభ్యులు

గూడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ తీసుకువచ్చిన సంస్కరణలతోనే విద్యావ్యవస్థ పటిష్ఠంగా మారిందని మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, సాహితీవేత్తగా ఆజాద్ దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. విద్యాశాఖలో సంస్కరణలు తీసుకువచ్చి 15 సంవత్సరాల వయస్సు వరకు నిర్బంధ విద్యావిధానాన్ని అమలు పరచడంతో పాటు ఎన్నో సాంకేతిక విద్యాసంస్థలను స్థాపించి పేదలకు విద్యను అందించే విధానానికి ఆజాద్ చేసిన కృషిని గుర్తించిన ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించిందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెహబూబ్‌బాషా, అబ్దుల్‌రహీం, కాలేషా, రఫూఫ్, అన్వర్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ప్రభాకర్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయులు

వెంకటగిరి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వన సంరక్షణ సమితి సభ్యులకు షేర్ అమౌంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఎఫ్‌డీఏ అకౌంట్ నుంచి వీఎస్‌ఎస్ సభ్యులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు మంజూరు చేయాలన్నారు. వెంకటగిరి రేంజ్ పరిధిలో 70 వన సంరక్షణ సమితులు ఉన్నాయని, వాటిల్లో జామాయిల్ ప్లాంటేషన్ చేపట్టడం జరిగిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 130 ప్లాంటేషన్ల కటింగ్ జరిగిందని, వాటి ద్వారా సుమారు రూ.10కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో సభ్యులకు 50శాతం పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం జేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, భాస్కర్, చిరంజీవి, విష్ణు, కృష్ణ, అంకయ్య, రమణయ్య, మణి, ప్రసన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు గణేష్



క్రీడాకారులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈవో శాంతి, ఉపాధ్యాయులు

గూడూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థి గణేష్ జాతీయస్థాయిలో హాకీ పోటీలకు ఎంపికైనట్లు డిప్యూటీ ఈవో శాంతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ స్థానిక శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు హేమంత్‌సాయి, కరీమున్నీసా, గణేష్ అనకాపల్లి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో జిల్లాజట్టు తరపున పాల్గొన్నాడని చెప్పారు. ఇందులో గణేష్ ప్రతిభ చాటి జాతీయస్థాయిలో హాకీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరు 25నుంచి 31వ తేదీ వరకు భోపాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున గణేష్ పాల్గొంటాడని చెప్పారు. సోమవారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో గణేష్‌ను సత్కరించారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, హెచ్‌ఎం భారతి, శ్రీనివాసులు, కరిముల్లాఖాన్, హరిబ్రహ్మ, శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దొరవారిసత్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాటంబేటి శ్రీనివాసులును తల్లంపాడు ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యాశాఖాధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రిని అవార్డు గ్రహీత శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, హుస్సేన్ బాబు, రమేష్, జీజే రాజశేఖర్, శేషయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెల్లక్వార్ట్జ రాయి లారీ స్వాధీనం

తడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెల్లక్వార్ట్జ రాయిని అక్రమంగా చెన్నైకు తరలివెళ్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట నుంచి చెన్నై వైపు తెల్లక్వార్ట్జ రాయితో వెళ్తున్న టిప్పర్‌ను భీములవారిపాళెం చెక్‌పోస్టులో సోమవారం తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలుకు వెళ్లేందుకు ట్రాన్సిస్టు పాసు కలిగి ఉండడాన్ని గుర్తించారు. అయితే చెన్నై వైపు వెళ్తుండడంతో అక్రమ రవాణాగా గుర్తించి కేసు నమోదు చేశామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. లారీ డ్రైవర్, క్లీనర్, యజమాని యనమల వెంకటేశ్వర్లు, మన్నవరపు రమేష్, మేక శివకుమార్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో దిగుమతి చేసుకునే మల్లికార్జున మినరల్ యజమాన్యంపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. అక్రమ రవాణా గురించి ఎటువంటి సమాచారమైనా పోలీసులకు తెలపాలని, లేదా వాట్సాప్ నెంబరు 8688478206కు మెసేజ్ ఇవ్వాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు సమీపంలో సోమవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలేవి లభ్యం కాలేదని రైల్వే ఎస్‌ఐ చెన్నకేశవులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్వర్ణముఖి నదిలో మృతదేహం

నాయుడుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీహరిబాబు సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 50 సంవత్సరాలలోపు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.





రైల్వే స్టేషన్ ముఖ ద్వారం - ప్లాట్‌ఫాంలో ఏర్పాటు చేసిన లిఫ్టులు

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.9.5 కోట్లతో అభివృద్ధి పనులు ● ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ ● ప్రయాణికులకు ప్రత్యేక వసతులు

సూళ్లూరుపేట, నవంబరు 11: తెలుగు, తమిళ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షార్ కేంద్రానికి ముఖ ద్వారమైన సూళ్లూరుపేట శాటిలైట్ టౌన్, వాణిజ్య నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న విషయం తెలిసిందే. ఇక్కడి రైల్వేస్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ అమృత్ పథకం కింద ఎంపిక చేసి రూ.9.5 కోట్లు కేటాయించింది. స్టేషన్‌లో మూడు ప్లాట్ ఫాంలు ఉండగా ప్రయాణికులకు వీలుగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. తూర్పువైపున ఉన్న మూడో ప్లాట్‌ఫారం నుంచి వచ్చే ప్రయాణికులకు కూడా లిఫ్టు అందుబాటులో ఉండేలా నిర్మాణాలు జరుగుతున్నాయి. సరుకులు, పార్శిళ్లు వచ్చినప్పుడు వాటిని సులువుగా చేర్చేందుకు ప్రత్యేక వాహనాలు వెళ్లేలా ప్లాట్‌ఫారం వరకు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నారు. స్టేషన్‌లో ఉచితంగా మినరల్ వాటర్ అందుబాటులో ఉండేలా నీటిశుద్ధి ట్యాంకు నిర్మిస్తున్నారు. స్టేషన్‌కు ఇరువైపులా ప్రయాణికుల కోసం మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. విశ్రాంత భవనానికి కూడా కొత్త హంగులు దిద్దుతున్నారు. రైల్వే స్టేషన్ చూడముచ్చటగా కనిపించేలా ముఖద్వారం నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని విస్తరించడమే కాకుండా భద్రత కల్పించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్టేషన్ పరిధిలో చోరీలకు అడ్డుకట్ట



మూడో నెంబరు ప్లాట్‌ఫాంపై కొత్త షెడ్ నిర్మాణం

పడే అవకాశం ఉంది. ఇక స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు తెలియజేసే వీలుగా కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్‌ఫాం షెడ్‌లను వెడల్పు చేసి రంగులు వేయడం వంటి సుందరవనంగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని పనులు పూర్తయి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.





చిట్టేడులోని యానాదుల గురుకుల పాఠశాల - ప్రహరీ పక్కనే కుప్పపోసిన కోళ్ల వ్యర్థాలు

గురుకులం పక్కన కోళ్ల వ్యర్థాల డంప్

దుర్గంధంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలకు అంటువ్యాధులు ముప్పు పొంచి ఉంది. ఇక్కడి గురుకులం పాఠశాలతో పాటు కళాశాలలో సుమారు 450 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. చిట్టేడు, కేశవరం ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను తీసుకొచ్చి గురుకుల పాఠశాల ప్రహరీ పక్కన పడేస్తున్నారు. ఈ వ్యర్థాల నుంచి నిత్యం దుర్గంధం వెలువడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు భోజనం చేసే సమయంతో పాటు రాత్రి నిద్రిస్తున్న సమయంలో కూడా దుర్గంధం వస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వ్యర్థాలు గాలిలో వ్యాపించి విద్యార్థుల భోజనంలో కలిసి కలుషితమయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలు గురుకులం పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.





గూడూరు శివాలయం, సూళ్లూరుపేట నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శివాలయాల్లో కార్తీక పూజలు

గూడూరు/సూళ్లూరుపేట/వెంకటగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రెండోవ సోమవారం గూడూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సంఘమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలలో పెద్ద సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలగించి స్వామివారిని దర్శించుకున్నారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. రైల్వేస్టేషన్ వద్ద నున్న నాగేశ్వరస్వామి, మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి, కల్యాణేశ్వరస్వామి, కొరిడి నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం అనంతరం పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, రామలింగేశ్వరస్వామి, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్దనున్న మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాలు సోమవారం మహిళలతో కిక్కిరిసిశాయి. ఉదయం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో సోమవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ మూడవ సంవత్సర విద్యార్థులు తయారు చేసిన డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అతి తక్కువ ఖర్చుతో డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారిరి చేసే విధానాన్ని వివరించారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత వద్దు

నాయుడుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపవద్దని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బాలాజీ రాజు అన్నారు. నాయుడుపేట పట్టణం కుమ్మరివీధిలో హెచ్‌ఐవీ నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొంత మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరసాకు పరామర్శ

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్ చేయించుకొని స్వగ్రామం గొట్టిప్రోలులో విశ్రాంతి తీసుకొంటున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంను సోమవారం టీడీపీ బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్, మెస్ రమణయ్య, బి.సుబ్రమణ్యం, ఎల్లయ్య, వి.శ్రీనివాసులు పరామర్శించారు.



పరసారత్నంతో టీడీపీ నాయకులు

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి

సూళ్లూరుపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) బీఎన్‌కండ్రిగ మండలం కాటూరు పంచాయతీలోని వేదాల శ్రీనివాసపురం దళితులు సాగు చేసుకుంటున్న భూములకు దళితులకే పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కన్వీనర్ చిన్నిరాజ్ మాట్లాడుతూ శ్రీనివాసపుర రెవెన్యూ సర్వే నెంబరు 340లో 39 ఎకరాలను ఆ గ్రామ దళితులు 30 సంవత్సరాలు పైగా సాగుచేసుకొంటుంటే ఇతరులకు పట్టాలు ఇవ్వడం అన్యాయమన్నారు. ఆ భూములను దళితులకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, కృష్ణయ్య దర్శయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

గూడూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండంలోని చెమిర్తి గ్రామ సమీపంలో సోమవారం మోటారు సైకిల్‌ను లారీ ఢీకొనడం యువకు డికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. చెమిర్తి గిరిజన కాలనీకి చెందిన సురేష్ ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంలో గూడూరుకు వెళ్లేందుకు ప్రధాన రహదారిపై చేరుతుండగా వెంకటగిరి వైపు నుంచి గూడూరు వైపు వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సురేష్‌కు గాయాలవడంతో గూడూరు ఆస్పత్రికి తరలించారు.

భూముల రీ సర్వేపై సమీక్ష



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

బాలయపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలయపల్లి మండలంలో భూముల రీసర్వే వివరాలపై తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా వీఆర్వోలతో చర్చించారు. రీసర్వేలో తప్పుగా నమోదైన భూముల వివరాలను సరి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్ఐ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను ఎంఈవో మస్తానయ్య సోమవారం పరిశీలించారు. 1నుంచి 5 తరగతుల విద్యార్థుల ప్రతిభా పాఠశాలను ఎంఈవో అంచనా వేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం రమీజాబేగం పాల్గొన్నారు.

ఆ తహసీల్దారుతో పనిచేయలేం

ఆర్డీవోకు సూళ్లూరుపేట రెవెన్యూ సిబ్బంది మొర

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దారు నరసింహరావుతో పనిచేయలేమని రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆర్డీవో కిరణ్మయికి మొరపెట్టుకొన్నారు. కార్యాలయంలో పనిచేసే అధికారులు, వీఆర్వోలు సోమవారం ఆర్డీవోను కలిసి తమను తహసీల్దారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. పని విషయంలో తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, సాయంత్రం వేళ చెప్పిన పనిచేసి పూర్తి చేసి వెళ్లాల్సిందేనని బలవంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే ఆయనతో కలిసి పనిచేయలేమని చెప్పినట్లు సమాచారం.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులను గెలిపించండి

డక్కిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో త్వరలో జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీచేసే అభ్యర్థులను గెలిపించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే నాయకులతో చర్చించారు. వీలైనని సంఘాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలన్నారు. అలాగే టీడీపీ మద్దతుదారులు విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఓటర్లు జాబితాలో మార్పులు, చేర్పులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అంతకుముందు టీడీపీ సభ్యత్వ నమోదుపై చర్చించారు. మండలంలో నూరు శాతం సభ్యత్వం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కలపాటి విజకుమార్, పులి జనార్ధనరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు, దందోలు రత్నాకరరెడ్డి, పోకూరు రమేష్, పాయశం గోపాల్, పొట్టా మునెయ్య, అయ్యపరెడ్డి, చంద్రమౌళి, రాజా, ముద్దా మునిస్వామిరెడ్డి, శివప్రసాద్, పీపీ చౌదిరి, వేముల నాగభూషణం నాయుడు, హరినాథ్, కుమార్, సుబాష్ చంద్రబోస్, దందవోలు పెంచలరెడ్డి, ఆలూరు దామోదరనాయుడు, ఆలూరు సుబ్బరామానాయుడు, కలివేలయ్య, మునికృష్ణయ్య, మేరగ రామయ్య, గరిటి చెంచయ్య, సంగనపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యభట్ట నగర్‌లో సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న షార్ విశ్రాంత ఉద్యోగులు

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యభట్టనగర్, విక్రమ్ సారాభాయ్ నగర్, శ్రీవారి నగర్ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని షార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, చిన్నపాటి వర్షమొచ్చిన మురుగుమయంగా మారుతోందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కాలనీలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం రెడ్డి, కుమారస్వామి సుదర్శనమం, ఆదిశేఖర్, కనకరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సాంబశివయ్య పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట/తడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ సీజన్ ప్రారంభమైనందున ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుగుల పార్థసారధి, రమణయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ● తడ తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ రాష్ట్ర ఉపాధ్య క్షుడు రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేల పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు అందిం చాలన్నారు. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలను రైతులు సాగుచేయకుండా బీడుగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటిం చిన విధంగా పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించి భూములను సాగులోకి తీసు కువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు శరత్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, మనోహర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.